విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :125 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 23 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ఆర్థిక కేంద్రంగా

# కుప్పం అభివృద్ధి



- ఎకనామిక్ హబ్‌గా కుప్పాన్ని అభివృద్ధి చేస్తాం
- కుప్పం అభివృద్ధిలో మరో మైలురాయి..
- దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్ ప్రారంభించిన చంద్రబాబు
- మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు

కుప్పం

కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్–పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పాన్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కుప్పం ప్రజలకు రైల్వే ప్రయాణ వివరాలు 2లో..

## పార్లమెంట్‌లో కొత్త రికార్డు

- 40 రోజులైనా ముగియని సెషన్
- కేంద్రం ప్లాన్ ఏంటి?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డ లోక్‌సభ, రాజ్యసభ
- సాధారణంగా మూడు, నాలుగు రోజుల్లోనే ప్రొరోగ్ అయ్యే సమావేశం
- 40 రోజులుగా అధికారికంగా ముగింపు ప్రకటన లేకపోవడం ఇదే తొలిసారి





## ఉగ్రవాదంపై ప్రకటనలు కావు చర్యలు ముఖ్యం

- పాకిస్తాన్‌పై భారత్ కీలక వ్యాఖ్యలు
- బంగ్లాదేశ్‌తో సంబంధాలపైనా ప్రకటన
- సరిహద్దు ఉగ్రవాదానికి సంబంధించి భారత విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు


# అక్టోబర్ 1న తుది జాబితా



- మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- 9 రోజుల పాటు నిర్వహణ
- మున్సిపల్ ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియ
- రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల గుర్తింపు ప్రక్రియ రేపటి (సెప్టెంబర్ 23) నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా రాష్ట్రంలోని 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు/నగర వివరాలు 2లో..



# టీడీపీకి సేవే లక్ష్యం

- డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం.. మంత్రి నారా లోకేశ్ సవాల్
- ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక..
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి
- 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్
- కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం

అమరావతి

ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు. తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో వివరాలు 2లో..






## భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం

- ఢిల్లీలో ఉన్నత స్థాయి చర్చలు విజయవంతం!
- ఢిల్లీలో విజయవంతంగా ముగిసిన భారత్
- ఒపెక్ 7వ ఉన్నత స్థాయి ఇంధన చర్చలు
- చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రతపై సమావేశం
- పరస్పర సహకారానికి అంగీకారం!



## రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ



## కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

- హెచ్చరికలు జారీ చేసిన హోంమంత్రి
- బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది
- కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.

అమరావతి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రాష్ట్ర హోంమంత్రి అనిత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని హై అలర్ట్‌లో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ప్రస్తుతం వాయుగుండం కొనసాగుతోంది. ఇది రానున్న 24 వివరాలు 2లో..

# కూటమి మరింత బలంగా ఉండాలి



- అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గింది
- కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండోరోజు పర్యటించారు
- పిఠాపురంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులకు పవన్ శ్రీకారం
- పిఠాపురం భహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి పవన్
- 'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం
- రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్‌పీటీల నిర్మాణం చేపట్టాం.

కాకినాడ

కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండో రోజు పర్యటించారు. ఇందులో భాగంగా రూ.1500 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంగళవారం ఉదయాన్నే పవన్ తన పర్యటనను ప్రారంభించారు. తొలుత గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీసీతారామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు పథకాల లబ్ధిదారుల కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఆ తర్వాత ఆర్ఆర్‌బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' బహిరంగ సభలో పవన్ పాల్గొన్నారు. 30 మంది మత్స్యకారులకు రక్షణ పరికరాలు అందించారు. నివాస గృహాల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు బ్యాగులు ఇచ్చారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు అందించారు. రైతు సంఘం నాయకులు పవన్ కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, నాగలిని వివరాలు 2లో..

# టీడీపీకి సేవే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని అన్నారు. అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్ అంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు. నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం ఆయనకు ఉందంటూ విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వచ్చి డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని చెప్పారు.

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

### పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం

కార్యకర్తే అధినేత నినాదాన్ని ఆచరణలో అమలు చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరని అన్నారు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తీసుకొచ్చామని తెలిపారు. రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యకర్తల ఆరోగ్యాన్ని చూసుకునే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

### పనిచేస్తే పదవులు వస్తాయి

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

### అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం

కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ వెళ్తోందని లోకేశ్ చెప్పారు. అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు కేటాయిస్తామని అన్నారు. రాప్తాడు ప్రాంతానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడులు తీసుకురావడంలో స్థానిక నాయకత్వానికి కూడా బాధ్యత ఉందని చెప్పారు.

### అనంతపురంలో సేవాభావం

అనంతపురం జిల్లాలో సేవాభావం ఉందని లోకేశ్ అన్నారు. లేపాక్షి, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, ప్రశాంతి నిలయం ఉన్న నేలగా అనంతపురాన్ని ప్రస్తావించారు. ఆర్‌డీటీ దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. సేవ చేయాలనే భావన తమలో ఉందని చెప్పారు. అందుకే ఎన్టీఆర్ అనంతపురం జిల్లాను సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

### పరిటాల కుటుంబంతో అనుబంధం

పరిటాల కుటుంబంతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని లోకేశ్ తెలిపారు. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడటం ఇరు కుటుంబాల ధ్యేయమని చెప్పారు. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారని పరిటాల శ్రీరాములయ్యను గుర్తుచేశారు. పరిటాల రవీంద్ర ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారని అన్నారు. ఉమ్మడి అనంతపురంలో పలువురు కార్యకర్తలను కోల్పోయామని తెలిపారు.

### రాప్తాడులో కార్యకర్తలకు అండగా

2019 నుంచి 2024 వరకు రాప్తాడులో టీడీపీ కేడర్‌ను ఇబ్బంది పెట్టారని లోకేశ్ ఆరోపించారు. తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. తనపై 23 కేసులు పెట్టారని తెలిపారు. పార్టీ కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదేనన్నారు. ఇప్పటికే 80 శాతం తప్పుడు కేసులు తొలగించామని చెప్పారు.

# ఆర్థిక కేంద్రంగా కుప్పం అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి



సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో కీలక అడుగు పడింది. దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడిన సీఎం.. వారి సమస్యలు, విజ్ఞప్తులను స్వీకరించారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించడంతో పాటు కుప్పాన్ని ఆర్థిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

### కుప్పంలో దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్

కుప్పం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది. రైలు నంబర్ 11005 దాదర్--పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో అదనపు హాల్ట్ కల్పించారు. ఈ హాల్ట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా వాస్కోడ గామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌ను కూడా ప్రారంభించారు. ఈ అదనపు హాల్ట్‌లతో కుప్పం ప్రజలకు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడం మరింత సులభం కానుంది. ప్రయాణికులకు మెరుగైన రైలు కనెక్టివిటీ అందించడంతో పాటు స్థానిక అవసరాలకు అనుగుణంగా రైల్వే సేవలను విస్తరించేందుకు ఈ చర్యలు దోహదపడనున్నాయి. చంద్రబాబు నాయుడు స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ కుప్పంలో ప్రస్తుతం 59 రైళ్లకు హాల్ట్‌లు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రైళ్లకు హాల్ట్‌లు కల్పించేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

### కుప్పాన్ని ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం

కుప్పం ప్రాంతం క్రమంగా ఎకనామిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు తెలిపారు. రైల్వే కనెక్టివిటీని మరింత మెరుగుపరచడం ద్వారా ఈ ప్రాంతానికి ఆర్థికంగా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కుప్పాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానించి, రాబోయే రోజుల్లో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పర్యాటక రంగం అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని వివరించారు. కుప్పం ప్రాంతంలో రైల్వే సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా కీలక విషయాలను వెల్లడించారు. గుడిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. డీకే పల్లి చెరువు సమీపంలో కూడా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు ముందుకు సాగితే స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది.

బెంగళూరు--చెన్నై నాలుగు వరుసల రైల్వే లైన్: బెంగళూరు--చెన్నై మధ్య నాలుగు వరుసల రైల్వే లైన్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు తెలిపారు. ఈ రైల్వే కనెక్టివిటీ కుప్పం ప్రాంతానికి కూడా ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే కుప్పం నుంచి చిత్తూరుకు రైల్వే కనెక్టివిటీ కల్పిస్తే నేరుగా తిరుపతికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. ఈ దిశగా కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందించవచ్చని తెలిపారు.

కుప్పం ప్రాంతం నుంచి రైల్ కార్గో రవాణాకు కూడా పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. పొగురుపల్లి సమీపంలోని డ్రై పోర్టును రైల్వే కనెక్టివిటీతో అనుసంధానించి కార్గో రవాణాను మెరుగుపరుస్తామని వెల్లడించారు. దీంతో సరకు రవాణాకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో రైల్వే కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. సమీప భవిష్యత్తులో బెంగళూరు నుంచి అమరావతికి వందే భారత్ రైళ్లను నడిపేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మధ్య ప్రయాణ సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

### కుప్పం అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ కీలకం

మొత్తంగా కుప్పంలో దాదర్--పుదుచ్చేరి, వాస్కోడగామ--వేళంగిణి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ల ప్రారంభంతో రైల్వే సౌకర్యాల విస్తరణలో మరో ముందడుగు పడింది. అదనపు హాల్ట్‌లు, ఆర్వోబీల ప్రతిపాదనలు, కార్గో రవాణా, ఇతర ప్రాంతాలతో రైల్వే అనుసంధానం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. కుప్పాన్ని ఆర్థిక కేంద్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలు అమలులోకి వస్తే స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యాలతో పాటు వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.

# లోకల్ పోల్స్‌కు కాంగ్రెస్ రెడీ...



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ–ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార–ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది.కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

## కూటమి మరింత బలంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

బహుమతిగా అందజేశారు. అనంతరం బహిరంగ సభలో పవన్ మాట్లాడారు.

ఉప్పాడ తీరంలో సముద్రపు కోత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. 323 కోట్ల రూపాయలతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అమృత్ భారత్ స్కీమ్ కింద 35 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మరో నాలుగు నెలల్లో తన క్యాంపు కార్యాలయాన్ని పిఠాపురానికి మార్చనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బహిరంగసభ వేదికగా జనసేన నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గిందంటూ చురకలు అంటించారు. అదే సమయంలో కూటమి మరింత బలంగా ఉండాలని ఆకాంక్షించారు. నాయకుల ఆకాంక్షల కన్నా ప్రజల అవసరాలకు ముందు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం. రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో 2 ఎస్‌పీటీల నిర్మాణం చేపట్టాం. రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నాం. రూ.34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు ప్రారంభించాం. రూ.2 కోట్లతో కుంతీ మాధవస్వామి ఆలయ కోనేరును పునరుద్ధరించాం. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. 40 టన్నుల తడి చెత్తను శుభ్రం చేసే ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నాం.'

సభలో పాల్గొనడానికి ముందే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 9 కోట్ల 59 లక్షల రూపాయలతో ఆధునీకరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్నిప్రారంభించారు. యూ.కొత్తపల్లి మండలంలోని సమగ్ర మంచినీటి సరఫరా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. పథకం వివరాలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేలా ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా పథకాన్ని ఆధునీకరించారు. మార్గమధ్యంలో కొండేవారంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్‌ను కూడా ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ గాయత్రి దేవి, చీఫ్ ఇంజినీర్ హరి రామ్ నాయక్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### స్వామివారి ప్రాతఃకాల సేవ

చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ఉదయం స్వామివారి ప్రాతఃకాల సేవలో పాల్గొన్నారు. రాములవారికి అష్టోత్తరాలతో పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన పవన్?కి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారి ఆలయం సమీపంలో సభ నిర్వహించిన విషయం తెలిసిందే. మరోసారి స్వామివారిని దర్శించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. విజయం అనంతరం ఆలయ అభివృద్ధికి రెండు విడతలుగా దాదాపు రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ఆలయంలో కాలక్షేప మండపం, రథశాల, అన్నదానం కోసం హాలు, యాగశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

## అక్టోబర్ 1న తుది జాబితా

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీలలో 9 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల రిజర్వేషన్ల కోసం గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రేపట్నుంచి నుంచి 9 రోజుల పాటు ఈ ప్రక్రియ నిర్వహణకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలోఈ ప్రక్రియను చేపడతారు. 23 నుంచి 25 వరకు. ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను వార్డుల వారీగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తారు. 26న ఈ జాబితాలు ఆయా మున్సిపల్ వార్డులలో ముసాయిదాగా ప్రకటిస్తారు. 27, 28 తేదీలలో ముసాయిదా ఓటర్ల గుర్తింపుపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరిస్తారు.

29, 30 తేదీలలో వీటిని పరిశీలించి క్షేత్ర స్థాయిలో ఏమైనా దిద్దుబాట్లు ఉంటే పూర్తి చేస్తారు. అక్టోబర్ 1న ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు సంబంధించి తుది జాబితాను ప్రకటిస్తారు. బీసీ ఓటర్ల విషయంలోనూ ఇదే రకంగా గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తారు. విశాఖ రీజియన్?లో జీవీఎమ్?సీతో సహా 4, రాజమహేంద్రవరం రీజియన్?లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహా 7, గుంటూరు రీజియన్?లో 9, అనంతపురం రీజియన్?లో 21 మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో తొలి విడత కింద ఈ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో వివరించింది. ఈమేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్? కుమార్ ఉత్తర్వులు వెలువరించారు.

### తూర్పు గోదావరిలో పరిస్థితి ఇలా

అమలాపురం పట్టణంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాల ప్రచురణ ప్రక్రియ పూర్తయింది. మొదట ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను విడుదల చేయగా, ఆ తర్వాత పోలింగ్ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల వంటి వర్గాల వారీగా తుది జాబితాలను ప్రచురించారు. ఈ జాబితాలను కమిషనరేట్‌కు పంపారు. అక్కడ రిజర్వేషన్ కేటగిరీలు ఖరారు చేస్తారు. పట్టణంలోని ఆశావహ అభ్యర్థులు చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్ కేటాయింపుల ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## కోస్తాంధ్రకు భారీ వర్ష ముప్పు

-మొదటిపేజీ తరువాయి

గంటల్లో మరింత బలపడనుంది. తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వాయుగుండం సెప్టెంబర్ 23 రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజామున తీరం దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు.

### ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి

వాయుగుండం ప్రభావంతో రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురవనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై దీని తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు జారీ చేయాలని ఆమె ఆదేశించారు.

### మత్స్యకారులకు హెచ్చరికలు

సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. తమ పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజల భద్రతపై అధికారులు దృష్టి సారించారు. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను ఎల్లవేళలా సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు.

### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. అలాంటి ప్రదేశాలు, కాజ్‌వేల వద్ద వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రాకపోకలను కట్టడి చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగాలుల సమయంలో భారీ వృక్షాలు, భారీ హోర్డింగులు, శిథిలావస్థకు చేరిన పాత భవనాల వద్ద ప్రజలు ఉండకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. విపత్కర సమయాల్లో ప్రజలు అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# నర్సీపట్నం అభివృద్ధికి రూ. 25 కోట్లు నిధులతో పలు పనులకు శ్రీకారం.

- కుప్పం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు.
- హాజరైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపీ విజయ్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కలెక్టర్ విజయ కృష్ణన్.






**నర్సీపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:** విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నర్సీపట్నం మున్సిపాలిటీ సమగ్ర రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం రూ. 25 కోట్ల అదనపు నిధులను కేటాయించింది. ఈ నిధులతో చేపడుతున్న పలు కీలక అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్ విధానంలో లాంఛనంగా శంకుస్థాపన చేశారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో మొత్తం రూ. 265 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ వర్చువల్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం లియో గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ వెంకట ప్రణవ్‌గోపాల్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. నర్సీపట్నాన్ని ఇప్పటికే విద్యా హబ్ గా తీర్చిదిద్దామని, భవిష్యత్తులో అత్యంత ప్రతిష్టాత్మకంగా 'సృష్టి క్షేత్రం' ఏర్పాటు చేసి పర్యాటక హబ్ గా అభివృద్ధి చేసేలా స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. నర్సీపట్నం అభివృద్ధికి అందరూ సహకరించాలని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంలో నాయకులు ముందుండాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ మాట్లాడుతూ నర్సీపట్నం అభివృద్ధికి స్పీకర్ అయ్యన్న పాత్రుడు తొలి ప్రాధాన్యత ఇస్తారని, పక్క నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడ రెండేళ్ల కాలంలోనే రూ. 532 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి కావడం విశేషమన్నారు. దేశం లోనే ఎక్కడా లేని విధంగా రూపుదిద్దుకోనున్న సృష్టి క్షేత్రం ఏర్పాటులో ఎవరూ రాజకీయం చేయవద్దని కోరారు. తన ఎంపీ నిధులతో నియోజకవర్గంలో ప్రత్యేక లైబ్రరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో ఉత్తమ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసర మైతే నర్సీపట్నం అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ గత రెండేళ్ల లోనే నర్సీపట్నంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఈ రూ. 25 కోట్ల నిధులతో పట్టణం లోని ప్రధాన కూడలి నుంచి శ్రీకన్య కూడలి, అబీద్ కూడలి మీదుగా డిగ్రీ కళాశాల వరకు ఆధునిక సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. అంతే కాకుండా మున్సిపాలిటీ పరిధి లోని మొత్తం 40 వార్డులలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నారని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి పై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, లాలం కాశీనాయుడు, సూర్యచంద్ర, మున్సిపల్ అధికారులు, స్థానిక కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నర్సీపట్నం అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం పై స్థానికులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.

# ధర్మవరంలో నిజాయితీకి పోలీసుల సత్కారం

- దొరికిన మూడు తులాల బంగారు నెక్లెస్‌ను పోలీసులకు అప్పగించిన ముగ్గురు
- నెక్లెస్‌ను పోగొట్టుకున్న రాజేశ్వరికి తిరిగి అందజేసిన పోలీసులు
- రామాంజనేయులు, నరసింహులు, సిద్ధమ్మలకు శాలువాలతో సన్మానం
- ముగ్గురికీ రూ.3 వేల చొప్పున నగదు పారితోషికం అందజేసిన సీఐ జయ నాయక్



**ధర్మవరం, సెప్టెంబర్ 22 (పెన్ సత్తా)** దొరికిన మూడు తులాల బంగారు నెక్లెస్‌ను ఆశపడకుండా పోలీసులకు అప్పగించిన ముగ్గురిని శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం టూ టౌన్ సీఐ జయ నాయక్ సత్కరించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 17న కళ్యాణదుర్గం నుంచి ప్రైవేట్ బస్సులో ధర్మవరం వచ్చిన రాజేశ్వరి, బస్సు దిగే సమయంలో తన వద్ద ఉన్న మూడు తులాల బంగారు నెక్లెస్‌ను పోగొట్టుకున్నారు. అదే రోజు ఆమె ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నెక్లెస్ దొరికిన కుమ్మర రామాంజనేయులు, ఆటో డ్రైవర్ నరసింహులు, కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన సిద్ధమ్మలు నెక్లెస్‌ను సమీపంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్ఐ ఇషాక్ భాషాకు అప్పగించారు. అనంతరం పోలీసులు రాజేశ్వరిని పిలిపించి నెక్లెస్‌ను ఆమెకు తిరిగి అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన రామాంజనేయులు, నరసింహులు, సిద్ధమ్మలను సీఐ జయ నాయక్ శాలువాలతో సత్కరించి, ఒక్కొక్కరికి రూ. 3 వేల చొప్పున నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, దొరికిన బంగారు ఆభరణాన్ని వెంటనే పోలీసులకు అప్పగించడం వారి నిజాయితీకి నిదర్శనమన్నారు. ఇలాంటి వారి సహకారంతో ఆభరణాలు పోగొట్టుకున్న వారికి త్వరగా న్యాయం అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎక్కడైనా బంగారు ఆభరణాలు లేదా ఇతర విలువైన వస్తువులు దొరికితే వాటిని సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు.

# ఘనంగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలు



దుర్గమ్మ దేవాలయంలో పరిటాల శ్రీరామ్ పేరిట ప్రత్యేక పూజార్చనలు చేయించిన..తెదేపా నాయకులు

పేదలకు అల్పాహారం అందజేసిన తెదేపా నాయకులు

తెదేపా కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు

**ధర్మవరం, సెప్టెంబర్ 22 (పెన్ సత్తా)** ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ గ్రామాన, వార్డులలో శ్రీరామ్ పుట్టినరోజు వేడుకలను తెదేపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు పురస్కరించుకొని పట్టణ తెదేపా నాయకులు దుర్గమ్మ దేవాలయంలో పరిటాల శ్రీరామ్ పేరిట ప్రత్యేక పూజలు అర్చన కార్యక్రమాలు చేయించారు. అన్నా క్యాంటీన్ వద్ద పేదలకు ఉచితంగా అల్పాహారాన్ని తెదేపా నాయకులు, కార్యకర్తలు అందజేశారు. అదేవిధంగా పాత మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు ఆనందోత్సవాలు మధ్య తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాప్తాడులో జరుగుతున్న పలు కార్యక్రమాలకు హాజరవుతున్న తెలుగుదేశంపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాప్తాడుకు విచ్చేస్తున్న సందర్భంగా భారీ స్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాప్తాడు లో జరుగుతున్న కార్యక్రమానికి తరలి వెళ్లారు.

# యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు పెంపొందించాలి.

మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.




**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:** జిల్లా లోని యువతకు, ముఖ్యంగా మహిళలకు పరిశ్రమలకు అవసర మైన నైపుణ్యాలను అందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రెన్యూ ప్రైవేట్. లిమిటెడ్. సంస్థతో నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభానికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకోవడం సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా జిల్లా లోని యువతకు, ముఖ్యంగా మహిళలకు పరిశ్రమలకు అనుగుణ మైన సాంకేతిక, ఉద్యోగ నైపుణ్యాల పై శిక్షణ అందిస్తారని, మొదటి దశలో 300 మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అచ్యుతాపురం లోని ఏపీఐఐసి కి చెందిన వన్ - స్టాప్ సెంటర్ నందు ఈ శిక్షణ కార్యక్రమం అక్టోబర్ నెల నుండి ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధన (రెన్యువబుల్ ఎనర్జీ) రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, స్థానిక యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించడమే కాకుండా, కుటుంబ, సామాజిక అభివృద్ధిలో క్రియాశీలకంగా మారతారని ఆకాంక్షించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్యం-ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించవచ్చని కలెక్టర్ తెలిపారు. యువత, ముఖ్యంగా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెన్యూ ప్రైవేట్. లిమిటెడ్. సంస్థకు చెందిన సీఈఓ సంజయ్ వర్గీస్, రెన్యూ ఫోటోవోల్టోక్స్ జితేంద్ర, త్రిభవన్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధుల ద్వారా రోడ్డు పనులకు రూ. 39.99 లక్షలు మంజూరు

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:** జిల్లాలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం సూచనల మేరకు అనకాపల్లి ఆర్అండ్‌బీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పర్యవేక్షణలో బీవీఎస్సార్ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్. లిమిటెడ్. సంస్థ చేపట్టిన రహదారి నిర్మాణ, మరమ్మతు పనులకు సంబంధించి, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నిధులు 39,99,078/- లను మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. యలమంచిలి - గాజువాక రోడ్డు లోని కిలో 18/2 నుండి మడుతూరు గ్రామం మీదుగా ఏపీఐఐసి ని కలిపే కనెక్టింగ్ రోడ్డు నిర్మాణం, కొండకర్ల మీదుగా హరిపాలెం-మడుతూరు రోడ్డు (పిఆర్ రీచ్) మరమ్మతు పనులను పూర్తి చేశారు. ప్రాధాన్య ప్రాతిపదికన చేపట్టిన ఈ పనులకుగాను జీఎస్టీ, సీనియోరేజ్ ఛార్జీలతో కలిపి మొత్తం రూ. 39,99,078/- (ముప్పై తొమ్మిది లక్షల తొంబై తొమ్మిది వేల డెబ్బై ఎనిమిది రూపాయలు) కు కాంట్రాక్టర్ మంజూరు చేశారు.

## పి.ఎస్ రాజు ని అభినందించిన కురసాల కన్నబాబు.



**కాకినాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:** కాకినాడ మాజీ మంత్రి, రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ని కలిసిన రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు పి.ఎస్. రాజు.

ఉమ్మడివిశాఖ జిల్లాల రీజనల కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ని రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడిగా ఇటీవల నియమితులైన పి.ఎస్. రాజు ఆదివారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పి.ఎస్. రాజు కురసాల కన్నబాబు ని కలిసి తనకు రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడిగా అవకాశం లభించిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి సాలవా తో సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు వివిధ అంశాల పై చర్చించారు.

## మజ్జివలసలో రాసపోలమాంబ అమ్మవారికి ఘనంగా 165వ అలంకరణ

తులసి, గజ మాలలతో అమ్మవారి అలంకరణ.. భక్తులకు ప్రసాదం పంపిణీ



**మజ్జివలస పెన్ సత్తా, సెప్టెంబర్ 22:**భీమిలి నియోజకవర్గం భీమిలి మండలం మజ్జివలస గ్రామంలో ఏడు గ్రామాల ఆరాధ్యదేవత శ్రీ రాసపోలమాంబ అమ్మవారి 165వ అలంకరణను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తులసి మాలలు, గజ మాలలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు భక్తిశ్రద్ధలతో ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రసాదాన్ని అందించిన కృష్ణంరాజుపేట గ్రామానికి చెందిన తుపాకుల అప్పలస్వామి, పాపియమ్మ, రామ్‌లక్ష్మణ్ కుటుంబ సభ్యులను అలంకరణ కమిటీ సభ్యులు అభినందించారు.

శ్రీ రాసపోలమాంబ అమ్మవారి కృపా కటాక్షాలు దాతల కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కళింగ వైశ్యుల దశాబ్దాల కల నెరవేరే రోజులు



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:**కళింగ వైశ్యుల దశాబ్దాల ఆకాంక్షలు నెరవేరే రోజులు వచ్చాయని రాష్ట్ర కళింగ వైశ్య ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళింగ వైశుృలకు గుర్తింపు, ప్రాధాన్యత, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళింగ వైశ్యులందరూ ఆర్థికంగా బలంగా ఉన్నారనే భావన సరికాదన్నారు. సామాజిక వర్గంలో పేద, వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని, వారి అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరమన్నారు.

గతంలో కళింగ వైశ్యులకు బీసీ–డీ కేటగిరీకి సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులు ఉత్తరాంధ్రకే పరిమితమయ్యాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కళింగ వైశ్యులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తమ సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

## కృష్ణాపురంలో వెరైటీ అన్నసమారాధనకు పోటెత్తిన భక్తులు



**కృష్ణాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:**వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కృష్ణాపురం పంచాయతీలోని రాయల్ స్ట్రీట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక అన్నసమారాధన నిర్వహించారు. సాధారణ అన్నదానానికి భిన్నంగా వివిధ రకాల వంటకాలను భక్తులకు ప్రసాదంగా అందించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అన్నసమారాధనలో భాగంగా ఇడ్లీ, బోండా, ఫ్రూట్ సలాడ్, లస్సీ, ఐస్‌క్రీమ్‌తో పాటు అన్నం, సాంబారు, కూరలను భక్తులకు వడ్డించారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కృష్ణాపురం గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఈ ప్రత్యేక అన్నసమారాధనను నిర్వహించినట్లు రాయల్ స్ట్రీట్ కమిటీ సభ్యులు తెలిపారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కృష్ణాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు హాజరుకావడంతో రాయల్ స్ట్రీట్ ప్రాంతం సందడిగా మారింది.

# హనుమాన్ జంక్షన్ లో 430 మంది పేదలకు హక్కు పత్రాల పంపిణీ.

- 430 మంది పేదలకు ఉచిత రిజిస్ట్రేషన్.. పొజిషన్ ధ్రువపత్రాలు అందజేత.
- పేదలకు చట్టబద్ధ మైన హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం మంత్రి సుభాష్.
- పేదల కళ్లలో కనిపించిన ఆనందం ఎప్పటికీ మరువలేనిది సుభాష్.
- గత ఎన్నికల్లో వైసీపీ నేతలకు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారు.
- కొడాలి నాని, వల్లభనేని వంశీ తీరు పై మంత్రి సుభాష్ తీవ్ర విమర్శలు.
- అహంకారపూరిత వ్యాఖ్యలకు ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెప్పారు సుభాష్.
- ఇది రాజకీయ సభ కాదు.. పేదలకు హక్కు కల్పించే కార్యక్రమం యార్లగడ్డ.
- నకిలీ పట్టాల పై కేసు నమోదు కాలేదని చెప్పేవారు ప్రమాణం చేసి చెప్పగలరా?.
- కొడాలి నాని గుడివాడలో బహిరంగ చర్చకు సిద్ధమా యార్లగడ్డ.
- యార్లగడ్డ వంటి ఎమ్మెల్యే దొరకడం గన్నవరం ప్రజల అదృష్టం కాగిత.












**గన్నవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 22:**పేదలకు చట్టబద్ధ మైన హక్కు కల్పించినప్పుడు వారి కళ్లలో కనపడిన ఆనందం ఎప్పటికీ మరువలేనిదని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ లోని ఎస్.ఆర్. కన్వెన్షన్ (రాయల్ హంపి కళ్యాణమండపం)లో మంగళవారం 430 మంది లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి పొజిషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీ నేతలకు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తీరు పై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అధికారంలో ఉన్న సమయంలో నోటికి వచ్చినట్లు మాట్లాడిన నేతలు, ప్రజల తీర్పుతో రాజకీయంగా చతికిలపడ్డారని వ్యాఖ్యానించారు. కుప్పంలో చంద్రబాబు నాయుడు ఓడిపోకపోతే ఆయన బూట్లు తుడుస్తానంటూ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ అహంకారపూరిత వ్యాఖ్యలకు ప్రజలే ఎన్నికల్లో సమాధానం చెప్పారని అన్నారు. వైసీపీ నేతలు ఇప్పటి కైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించు కోకుండా, ప్రత్యర్థుల పై వ్యక్తిగత విమర్శలు, అసభ్య వ్యాఖ్యలకే ప్రాధాన్యమిచ్చారని విమర్శించారు. ప్రజలు తిరస్కరించిన తర్వాత కూడా అదే ధోరణిని కొనసాగిస్తూ మళ్లీ అధికారం లోకి వస్తామంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యల పై పోరాడటం, అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ ప్రణాళికలు చెప్పడం మానేసి.. అధికారం లోకి వస్తే అధికారుల బట్టలు ఊడదీస్తాం, నరికేస్తామంటూ బెదిరింపు వ్యాఖ్యలు చేయడం వారి రాజకీయ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వ్యవహారశైలిని కూడా మంత్రి తప్పుబట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన పట్టాల విషయంలో వివాదాలు సృష్టించి ప్రజలను అయోమయానికి గురిచేశారని విమర్శించారు. రైతులకు సుమారు రూ.2 కోట్ల విలువైన మోటార్లు అందించిన తర్వాత వాటిని తిరిగి ఇవ్వాలని కోరడం చిన్నపిల్లలు ఆటలో ఓడిపోయిన తర్వాత తమ బ్యాట్లు, వికెట్లు తిరిగి అడిగినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. అయితే ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు తన సొంత ఖర్చులతో మోటార్లు అందించడం ద్వారా తన చిత్తశుద్ధిని చాటుకున్నారని చెప్పారు. మాట ఇస్తే మడమ తిప్పనని చెప్పుకునే వైసీపీ నాయకులు ఎన్నిసార్లు మాట మార్చారో ప్రజలకు తెలుసని మంత్రి అన్నారు. దీనికి భిన్నంగా యార్లగడ్డ వెంకట్రావు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ఎంతటి కష్ట మైనా వెనుకాడకుండా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు విశ్రమించని ముక్కుసూటి నాయకుడిగా ప్రజల మధ్య ఉంటున్నారని చెప్పారు. రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నారని, గత ప్రభుత్వ నేతలు మాత్రం ప్రజల్లోకి వచ్చి తమ పాలన గురించి చెప్పే పరిస్థితిలో లేరని విమర్శించారు. వైసీపీకి ప్రజలు ఇప్పటికే చరమగీతం పాడారని, ఇకనైనా మేకపోతు గంభీరాన్ని విడిచి ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం పై మాట్లాడాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. ప్రజలకు ఏం చేస్తామో చెప్పకుండా కేవలం బెదిరింపులు, వ్యక్తిగత దూషణలతో రాజకీయాలు చేయడం వల్ల ప్రజల విశ్వాసం తిరిగి రాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన 430 మంది ఏదో ఒక పార్టీకి మాత్రమే చెందినవారు కాదని, తనకు ఓటు వేసిన వేసిన వారు వేయని వారు కూడా ఉన్నారని అన్నారు. ఇది రాజకీయ సభ కాదని, పేదలకు హక్కు కల్పించే కార్యక్రమమన్నారు. గతంలో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘటన పై 2019 ఎన్నికలకు ముందు ఫిర్యాదుతో కేసు నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. నకిలీ పట్టాల పై కేసు నమోదు కాలేదని చెప్పేవారు దుర్గమ్మ సాక్షిగా ప్రమాణం చేసి చెప్పగలరా అంటూ మాజీ మంత్రి కొడాలి నాని కి సవాల్ విసిరారు. అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కొడాలి నాని ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మాట్లాడటం కాదని, ఇప్పుడు కూడా అదే ధైర్యంతో మాట్లాడాలని అన్నారు. అక్రమ కేసులు, అక్రమ మైనింగ్ అంశాల పైనా మాజీ మంత్రులు సమాధానం చెప్పాలని యార్లగడ్డ డిమాండ్ చేశారు. నారా లోకేష్ పాదయాత్ర సమయంలో తన పై ఒకే రోజు ఏడు కేసులు నమోదు చేశారని, తాను మాత్రం వైసీపీ కార్యకర్తలపై ఒక్క తప్పుడు కేసు కూడా పెట్టలేదన్నారు. కొండపావులూరు ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరగలేదని దేవుడి సాక్షిగా ప్రమాణం చేసి చెప్పగలరా అంటూ మాజీ మంత్రులను ప్రశ్నించారు. గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, గాంధీబొమ్మ సెంటర్‌తో పాటు ప్రధాన రహదారుల విస్తరణతో పట్టణ రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. తాము అభివృద్ధి పై దృష్టి సారిస్తుంటే ప్రతిపక్షం రాజకీయాలకే పరిమితమవుతోందని విమర్శించారు.గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. 430 మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన హక్కు పత్రాలు అందించడం అభినందనీయమన్నారు. తాను గుడివాడలో పుట్టి పెరిగినా గన్నవరం, హనుమాన్ జంక్షన్‌కు తరచూ వచ్చేవాడినని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ఫలితాల సమయంలో గుడివాడ, గన్నవరం ఎవరు గెలుస్తారో అని చూసిన పరిస్థితి ఉందన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. గన్నవరం నియోజకవర్గ ప్రజలకు యార్లగడ్డ వెంకట్రావు వంటి ఎమ్మెల్యే దొరకడం అదృష్టమన్నారు. ఏదైనా సమస్యను పట్టుకుంటే పరిష్కారం లభించే వరకు వదిలిపెట్టరని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, అసమర్థ పాలన సాగిందని విమర్శించారు. మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో గత పాలనను, ప్రస్తుత పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రజలను పక్కదారి పట్టించేలా వైసీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ చిత్తశుద్ధితో యార్లగడ్డ వెంకట్రావు పనిచేస్తున్నారని అభినందించారు. పేదల కోసం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు జరుగుతున్న మంచి ఏమిటో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణం పెద్దగా కనిపించలేదని విమర్శించారు. గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, గన్నవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు ఆకుల జయసత్య, గన్నవరం నియోజకవర్గ వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు, ఏపీ రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, గన్నవరం మండల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, ఉంగుటూరు మండల టీడీపీ అధ్యక్షులు కొలుసు రవీంద్ర బాబు, విజయవాడ రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు గొడ్డల్ల చిన్న రామారావు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మల్ఫురి సాయి కళ్యాణి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కానూరు శేషుమాధవి, టీడీపీ సీనియర్ నాయకులు దొంతు చిన్న, వేములపల్లి శ్రీనివాసరావు, బొప్పన హరికృష్ణ, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మొవ్వ వెంకటేశ్వరరావు, గన్నవరం నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, బాపులపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, డీసీ–2 చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానికులు పాల్గొన్నారు.

# రక్తం అందుకున్న కుటుంబం నుంచి... 49 సార్లు ప్రాణదానం

**తల్లి ప్రాణాలను కాపాడిన రక్తదాతల స్ఫూర్తితో సేవా ప్రయాణం.. 16 సార్లు రక్తదానం, 33 సార్లు ఎస్‌డీపీ దానం**



**విశాఖపట్నం పెన్ సత్తా, సెప్టెంబర్ 22:** రక్తదానం కొందరికి సేవా కార్యక్రమం కావచ్చు. కానీ గొల్లపల్లి తరుణ్‌కు మాత్రం అది తన కుటుంబానికి గతంలో అందిన సహాయానికి కృతజ్ఞతగా భావించే బాధ్యతగా మారింది. తన తల్లి ప్రాణాలను రక్తదాతలు కాపాడిన సంఘటనతో స్ఫూర్తి పొందిన ఆయన, నేడు 49 సార్లు రక్తం, ఎస్‌డీపీ దానం చేసి పలువురి ప్రాణాలకు అండగా నిలుస్తున్నారు. తరుణ్ పుట్టిన సమయంలో ఆయన తల్లి గొల్లపల్లి అరుణ తీవ్ర రక్తస్రావానికి గురయ్యారు. అత్యవసరంగా రక్తం అవసరమైన సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు రక్తదానం చేయడంతో ఆమె ప్రాణాలు నిలిచాయి. ఆ సంఘటన చిన్ననాటి నుంచే తరుణ్‌పై ప్రభావం చూపింది. అవసరంలో ఉన్న మరో కుటుంబానికి తాను కూడా అండగా నిలవాలనే సంకల్పం ఆయనలో ఏర్పడింది. 2017 ఫిబ్రవరి 15న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తొలిసారిగా రక్తదానం చేశారు. ఆ తర్వాత కళాశాలల్లో నిర్వహించిన రక్తదాన శిబిరాలతో పాటు, ఆసుపత్రుల నుంచి వచ్చే అత్యవసర పిలుపులకు స్పందిస్తూ రక్తదానాన్ని కొనసాగించారు. ముఖ్యంగా గర్భిణులకు అత్యవసరంగా రక్తం అవసరమైన సందర్భాల్లో ముందుండి సహాయం చేసేవారు. 2018 జూన్ 30న తండ్రి గొల్లపల్లి సత్యనారాయణ నుంచి వచ్చిన ఫోన్ కాల్ తరుణ్ సేవా ప్రయాణంలో మరో ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఆయన స్నేహితుడి తల్లికి అత్యవసరంగా రక్తం అవసరమవడంతో వెంటనే స్పందించి రక్తదానం చేశారు. అనంతరం ఆమె కొంతకాలం ఆరోగ్యంగా జీవించగలిగిందని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

2020లో ‘వీ ఆర్ విత్ యూ’ చారిటబుల్ ట్రస్ట్‌లో చేరిన తర్వాత తరుణ్ సేవలు మరింత విస్తరించాయి. వివిధ సంస్థల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సుమారు 300 యూనిట్ల రక్త సేకరణకు తన వంతు సహకారం అందించారు. 2021లో ఆయన మేనమామ సల్లబత్తుల అశోక్ కుమార్ క్యాన్సర్ చికిత్స పొందుతున్న సమయంలో ఆసుపత్రిలో రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులను తరచూ చూశారు. వారికి రక్తం, ప్లేట్‌లెట్స్ అవసరం గురించి తెలుసుకున్న తరుణ్, ప్లేట్‌లెట్స్ దానం చేయాలని నిర్ణయించుకున్నారు. 2022 సెప్టెంబర్ 9న తొలిసారిగా సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ) దానం చేశారు. అప్పటి నుంచి అవసరమైన క్యాన్సర్ రోగులకు ఎస్‌డీపీ దానం చేస్తూ వస్తున్నారు.

రోగి కుటుంబ సభ్యుడిగా ఎదురైన అనుభవం

2025 జూలై 13న తన సోదరి తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చేరిన సందర్భం తరుణ్‌కు రక్తం అవసరమైన కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితిని ప్రత్యక్షంగా అర్థం చేసుకునేలా చేసింది. అప్పటివరకు దాతగా ఆసుపత్రుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించిన ఆయన, ఆ రోజు రోగి కుటుంబ సభ్యుడిగా రక్తం కోసం దాతలను సంప్రదించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో రక్తం, వివిధ రక్త భాగాలు అవసరమవడంతో రక్తదాతల కోసం చేసిన ప్రయత్నాలు ఆయనకు కొత్త అనుభవాన్ని ఇచ్చాయి. అవసరంలో ఉన్నవారికి సమయానికి స్పందించడం ఎంత ముఖ్యమో ఆ ఘటన మరోసారి తెలియజేసిందని తరుణ్ చెబుతున్నారు.

ఇప్పటివరకు తరుణ్ 16 సార్లు రక్తదానం, 33 సార్లు ఎస్‌డీపీ దానం చేశారు. మొత్తంగా 49 సార్లు ప్రాణదానంలో భాగస్వామ్యమయ్యారు.తన పుట్టుక సమయంలో తన తల్లికి ఎవరో అందించిన రక్తం నుంచి స్ఫూర్తి పొంది, నేడు తాను మరొకరి ప్రాణాలను కాపాడేందుకు రక్తాన్ని అందిస్తున్న తరుణ్ ప్రయాణం సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. 50వ దానం ఆయన సేవా ప్రయాణంలో మరో మైలురాయి కానుండగా, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలనే తన ప్రయత్నాలకు మాత్రం ముగింపు లేదని ఆయన పేర్కొంటున్నారు.

# పార్లమెంట్‌లో కొత్త రికార్డు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల విషయంలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. లోక్‌సభ, రాజ్యసభలు నిరవధికంగా వాయిదా పడి 40 రోజులు గడిచినా, మాన్‌సూన్ సెషన్ మాత్రం అధికారికంగా ముగియలేదు. సాధారణంగా సభలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రపతి ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేస్తారు. కానీ ఈసారి ఇప్పటివరకు అలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రభుత్వం ఏదైనా కీలక బిల్లును వర్షాకాల సమావేశాలను తిరిగి కొనసాగిస్తూ తీసుకురావాలనుకుంటోందా అనే చర్చ మొదలైంది. రెండు సభలు ఇంతకాలం ప్రొరోగ్ కాకుండా ఉండటం ఇదే తొలిసారి అని మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి తాజాగా వెల్లడించారు. 2015లో కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో రెండు సభలు 28 రోజుల తర్వాత ప్రొరోగ్ అయ్యాయి. అప్పటి ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) చట్టంపై ఏకాభిప్రాయం కోసం ప్రయత్నాలు చేసింది. ఇప్పుడు 40 రోజులు దాటడంతో ఆ రికార్డు కూడా అధిగమించినట్లైంది. 2026 మాన్‌సూన్ సెషన్ జులై 20న ప్రారంభమై ఆగస్టు 13న ముగిసింది. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 సిట్టింగ్స్ జరిగాయి. రెండు సభల్లో పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే కీలకమైన కొన్ని ప్రతిపాదనలు మాత్రం పెండింగ్‌లోనే ఉన్నాయి.

**అసలు ఎందుకు ప్రొరోగ్ చేయలేదు?**

పార్లమెంట్ సమావేశం ముగియడం, సభను నిరవధికంగా వాయిదా వేయడం రెండూ ఒకటే కాదు. అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటే సభను తదుపరి తేదీ ప్రకటించకుండా వాయిదా వేయడం. ప్రొరోగేషన్ అంటే ఆ సమావేశాన్ని అధికారికంగా ముగించడం. రెండో ప్రక్రియ రాష్ట్రపతి ఉత్తర్వులతో జరుగుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంట్‌ను సమావేశపరచడం, ప్రొరోగ్ చేయడం రాష్ట్రపతి అధికార పరిధిలో ఉంటుంది. అయితే ఇది కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు జరుగుతుంది. అందువల్ల మాన్‌సూన్ సెషన్‌ను ఇంకా అధికారికంగా ముగించకపోవడం వెనుక ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి నిర్ణయంపై ఆసక్తి పెరిగింది.

**మహిళా రిజర్వేషన్- డీలిమిటేషన్‌పై చర్చ**



ప్రస్తుతం ప్రధానంగా మహిళా రిజర్వేషన్, లోక్?సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలే చర్చలో ఉన్నాయి. మహిళళకు లోక్?సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ ఇప్పటికే 2023లో చట్టంగా మారింది. అయితే దాని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన, జనగణనతో సంబంధం ఉన్న నిబంధనలు కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రధానంగా మహిళా రిజర్వేషన్, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలే చర్చలో ఉన్నాయి. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ ఇప్పటికే 2023లో చట్టంగా మారింది. అయితే దాని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన, జనగణనతో సంబంధం ఉన్న నిబంధనలు కీలకంగా ఉన్నాయి. 2026 బడ్జెట్ సమావేశాల సమయంలో మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయడానికి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. అయితే అవసరమైన రాజ్యాంగ మెజారిటీ లభించకపోవడంతో ఆ బిల్లుపై తదుపరి చర్య కొనసాగలేదు. దానికి అనుబంధంగా ఉన్న డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులు కూడా ముందుకు సాగలేదు.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల వాటా తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన కొంతకాలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు ఇది ప్రతికూలంగా మారుతుందన్న వాదన ఉంది. ఆ ఆందోళనలను తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే నిష్పత్తిలో పెంచే ఫార్ములాపై చర్చ జరుగుతోందన్న సమాచారం ఉంది. ఇందులో 50 శాతం వరకు స్థానాల పెంపు ప్రతిపాదన ఉందన్న ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ అంశంపై తుది నిర్ణయం, అధికారిక బిల్లు వివరాలు స్పష్టంగా వెలువడాల్సి ఉంది.

**ప్రత్యేక సమావేశం ఉంటుందా?**

వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రొరోగ్ చేయకపోవడంతో మరో అంశంపై కూడా ఊహాగానాలు పెరిగాయి. కొత్తగా ప్రత్యేక సమావేశం నిర్వహించకుండా, ప్రస్తుతం ముగింపు ప్రకటన రాని సమావేశాన్ని అవసరమైన సమయంలో కొనసాగించే అవకాశం ఉందా అనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన బిల్లుల కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉందని గతంలో పలు నివేదికలు వచ్చాయి. అయితే ఇప్పటివరకు ప్రత్యేక సమావేశానికి తేదీలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు.

**శీతాకాల సమావేశాల ముందు కీలక పరిణామం**

సాధారణంగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ చివరి వారంలో ప్రారంభమై క్రిస్మస్‌కు ముందు ముగుస్తాయి. అంతకుముందే మాన్‌సూన్ సెషన్ అధికారికంగా ముగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వచ్చే రోజుల్లో కేంద్రం తీసుకునే నిర్ణయం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం మాత్రం ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఆగస్టు 13న రెండు సభలు నిరవధికంగా వాయిదా పడినా, సెషన్ అధికారికంగా ముగియలేదు. 40 రోజులకు చేరిన ఆ అసాధారణ పరిస్థితి పార్లమెంటరీ ప్రక్రియలోనే కొత్త రికార్డుగా నిలిచింది.

# భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం

ప్రపంచంలోనే అతిపెద్ద చమురు వినియోగదారుల్లో మూడో స్థానంలో ఉన్న భారత్- పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ (ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్) మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. దిల్లీ వేదికగా మంగళవారం భారత్, ఒపెక్ కూటమి మధ్య 7వ హై లెవల్ ఎనర్జీ డైలాగ్ (ఉన్నత స్థాయి ఇంధన చర్చలు) విజయవంతంగా ముగిసింది. ప్రపంచ చమురు మార్కెట్లో ఒకవైపు అనిశ్చితి, ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్న వేళ భారత్, ఒపెక్ మధ్య ఈ చర్చలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి భారత పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ, ఒపెక్ సెక్రటరీ జనరల్ హైథమ్ అల్ ఘైస్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ముఖ్యంగా చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రత, చమురు రంగంలో పెట్టుబడులు పెట్టడం వంటి అంశాల గురించి విస్తృతంగా చర్చించారు. పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అంగీకరించారు. భారత్ తన చమురు అవసరాల్లో ఏకంగా 88 శాతానికిపైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు వంటివి భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే భారత్, ఒపెక్ మధ్య పరస్పర సహకారం, సత్సంబంధాలు ఉన్నాయని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఒపెక్ ప్రధాన కార్యదర్శి అందిస్తున్న సహకారానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని హర్దీప్ సింగ్ పురీ పేర్కొన్నారు. రానున్న దశాబ్దాల్లో అంతర్జాతీయంగా ఇంధన వినియోగంలో, డిమాండ్ పెంచడంలో భారత్ కీలక శక్తిగా అవతరిస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇంధన రక్షణకు చమురు ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య నిరంతర చర్చలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇది




ఇంధన రంగంలో పెట్టుబడుల్ని ప్రోత్సహించడంతో పాటుగా ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. అప్పుడే ఇంధన సరఫరాలో అంతరాయాలు ఉండవని తెలిపారు.

**భారత్‌తో చర్చలు ఒపెక్‌కూ ముఖ్యమే!**

మరోవైపు భారత్‌తో ఇంధన భాగస్వామ్యానికి ఒపెక్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఒపెక్ సెక్రటరీ జనరల్ హైథమ్ తెలిపారు. భారత ఇంధన ప్రాధాన్యతలు, ఒపెక్ లక్ష్యాలకు చాలా దగ్గరగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రపంచ ఇంధన వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని, రానున్న దశాబ్దాల్లో భారత్ ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. ఒపెక్ కూటమి, భారత్ మధ్య ఈ ఎనర్జీ డైలాగ్ 11 సంవత్సరాలుగా కొనసాగుతోందని హైథమ్ అల్ ఘైస్ గుర్తు చేశారు. ప్రపంచంలో పుట్టుకొస్తున్న సవాళ్లను పరిష్కరించడానికి భారత్ ఎప్పుడూ దౌత్య మార్గంలో పయనిస్తుందని, చర్చల కోసమే నిరంతరం ప్రోత్సహించడం సంతోషకరమని వ్యాఖ్యానించారు.

**2015లో ప్రారంభమైన ఇంధన చర్చలు**

భారత్- ఒపెక్ మధ్య ఎనర్జీ డైలాగ్‌ను (ఇంధన చర్చలు) తొలిసారి 2015లో దిల్లీలో ప్రారంభించారు. అప్పటి నుంచి ఉన్నత స్థాయిలో సమావేశాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారుల సమాఖ్యకు, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగ దేశమైన భారత్‌కు మధ్య సమన్వయం కోసం ఇదో చక్కటి వేదికగా పనిచేస్తోంది. ప్రస్తుతం అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొనగా చమురు మార్కెట్ స్తంభించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సప్లై చెయిన్‌లో అంతరాయాలు, పెరుగుతున్న డిమాండ్ వంటి ఎన్నో అంశాలు ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భవిష్యత్తు చమురు సరఫరాను మెరుగుపర్చడం, భద్రత కోసం సకాలంలో పెట్టుబడులు కూడా అవసరమని భారత్, ఒపెక్ అభిప్రాయపడ్డాయి. ఇక ప్రస్తుత 7వ విడత చర్చలు విజయవంతం కావడంతో తదుపరి 8వ ఉన్నత స్థాయి సమావేశాన్ని ఆస్ట్రియాలోని వియన్నాలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంకా సమావేశానికి సంబంధించి తేదీలు ఖరారు చేయలేదు. వియన్నాలోనే ఒపెక్ ప్రధాన కార్యాలయం ఉంది.

# కావేరి నదీ జలాల వివాదంలో థర్డ్ పార్టీలు జోక్యం చేసుకోలేవు

కావేరీ జలాల్లో కర్ణాటకకు 70 టీఎంసీల నీటిని అదనంగా కేటాయించాలంటూ ఓ ప్రైవేట్ సొసైటీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్-పార్టీలు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఇలా సొసైటీల పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ముగియవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే చట్టపరంగా పోరాడుతున్నాయన్న కోర్టు రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని తేల్చి చెప్పింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే హక్కు ఉంటుదని పునరుద్ఘాటించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కావేరి కేసుల నేపథ్యంలో కొత్త వ్యాజ్యాలకు తావులేదంటూ పిటిషన్ కొట్టేసింది. ఇదిలా ఉండగా, కావేరీ నీటి విడుదలపై కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టుకు తన వాదనను వినిపించింది. ఆగస్టు 31 నాటికి తమిళనాడుకు నిర్దేశించిన పరిమాణం కంటే ఎక్కువ నీటిని విడుదల చేసినట్లు కర్ణాటక తెలిపింది. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తూ, తమిళనాడు వైపు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించింది. ఆగస్టు 25న సీడబ్ల్యూఎంఏ కీలక నిర్ణయం తీసుకుంది. కావేరీ వాటర్ రెగ్యులేషన్ కమిటీ (సీడబ్ల్యూఆర్?సీ) చేసిన సిఫార్సును సమర్థిస్తూ, తమిళనాడుకు 15 రోజుల పాటు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కర్ణాటక నిర్ధారించాలని ఆదేశించింది. బిలిగుండ్లులో ఈ ప్రవాహాన్ని కొనసాగించాలని సూచించింది. ఈ నిర్ణయం సీడబ్ల్యూఎంఏ 56వ సమావేశంలో తీసుకున్నారు.

**నీటి బకాయిలపై తమిళనాడు అభ్యంతరం**

అయితే కర్ణాటక నుంచి నీటి విడుదల విషయంలో తమకు రావాల్సిన వాటాలో లోటు ఏర్పడిందని తమిళనాడు ప్రభుత్వం చెబుతోంది. సీడబ్ల్యూఎంఏ దృష్టికి నీటి బకాయిల అంశాన్ని తీసుకెళ్లినా, ఆ విషయంలో ప్రత్యేకంగా ఎలాంటి ఆదేశాలు వెలువడలేదని తమిళనాడు తరఫు న్యాయవాదులు గత విచారణలో తెలిపారు. కావేరీ జలాల విడుదలపై తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వర్షాభావ పరిస్థితుల్లో తమకు రావాల్సిన నీటి వాటా అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో కర్ణాటక నుంచి తక్షణమే నీటిని విడుదల చేయించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

**ఇప్పటికే కొనసాగుతున్న న్యాయపోరాటం**

ఆగస్టు 25న సుప్రీంకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి, తన నీటి విడుదలకు సంబంధించిన ఫిర్యాదును సీడబ్ల్యూఎంఏ ముందు ప్రస్తావించుకోవచ్చని సూచించింది. ఆ తర్వాత సీడబ్ల్యూఎంఏ సమావేశమై 9,000 క్యూసెక్కుల ప్రవాహాన్ని 15 రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుతం కూడా కావేరీ నీటి పంపిణీ అంశంపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతోంది. సెప్టెంబరు 18న తమిళనాడు ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించి కర్ణాటక నుంచి తమకు రావాల్సిన నీటి వాటాను విడుదల చేయాలని కోరింది. మేట్టూరు రిజర్వాయర్‌లో పరిమిత నీటి నిల్వ మాత్రమే ఉందని, అది సుమారు 30 రోజులకు సరిపడే స్థాయిలో ఉందని రాష్ట్రం పేర్కొంది. బ్రిటీష్ పాలనా కాలంలోనే కావేరి వివాదం మూలాలు ఉన్నాయి. 1892లో, తరువాత 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ మధ్య రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. దాని ప్రకారం దిగువన ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం లభించిందని, ఎగువన ఉన్న మైసూర్ అభివృద్ధికి పరిమితులు విధించారని కర్ణాటక వాదిస్తోంది. కావేరీ నదీజలాల వివాదాన్ని పరిష్కరించడం కోసం 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జల వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 17 ఏళ్ల విచారణ అనంతరం 2007లో ట్రిబ్యునల్ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే దీనిపై ఇరు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కేసు సుప్రీంకోర్టుకు చేరింది.

## ‘ఉగ్రవాదంపై ప్రకటనలు కావు చర్యలు ముఖ్యం’

సరిహద్దు ఉగ్రవాదంపై పాకిస్థాన్ విశ్వసనీయమైన చర్యలు తీసుకునే వరకు ఆ దేశం చేస్తున్న ప్రకటనలను ప్రపంచం నమ్మదని భారత్ స్పష్టం చేసింది. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదం, బంగ్లాదేశ్, జపాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, అమెరికా తీసుకొస్తున్న చట్టం, నేపాల్‌లో వరదల్లో గల్లంతైన భారతీయులు గుర్తింపు వంటి అంశాల గురించి స్పందించారు. పాకిస్థాన్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇటీవల ఉగ్రవాదాన్ని తుదముట్టిస్తామని, అందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత్ వైఖరి ఏంటి అని విలేకరులు ప్రశ్నించగా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ మాటలతో చెబితే సరిపోదని, తమ మాటలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, సరిహద్దు ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు అత్యంత నిబద్ధత చూపించాలని అన్నారు. ఆచరణాత్మకంగా విశ్వసనీయ చర్యలు తీసుకున్నప్పుడే అంతర్జాతీయ సమాజం పాక్ ప్రకటనల్ని నమ్ముతుందని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో పాకిస్థాన్ కొన్ని అంతర్జాతీయ న్యాయపరమైన నిర్ణయాల్ని తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటోందన్న ప్రశ్నపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్‌కు వాస్తవాల్ని వక్రీకరించడం, అబద్ధాలను ప్రచారం చేయడం అలవాటేనని అన్నారు. ‘పాక్ మంత్రి చెబుతున్నట్లుగా అది పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (గాజూా) అధికారిక తీర్పు కాదు. అది చట్టవిరుద్ధంగా ఏర్పాటైన ఒక కోర్టు ఇచ్చిన తీర్పు. వాస్తవాల్ని దాచిపెట్టేందుకు పాక్ చేస్తున్న ఇది మరో ప్రయత్నం మాత్రమే.’ అని జైస్వాల్ వివరించారు.

**అఫ్గాన్‌లో పాక్ దాడులు- ఖండించిన భారత్**

మరోవైపు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా ప్రావిన్సులపై పాకిస్థాన్ చేపట్టిన వైమానిక దాడులను కూడా భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో పలువురు పౌరులు మరణించారని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నామని జైస్వాల్ అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దాడులతో పాకిస్థాన్- ప్రాంతీయంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తోందని స్పష్టం చేశారు. అఫ్గాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు.

**బంగ్లాదేశ్‌తో సానుకూల సంబంధాల్ని కోరుకుంటున్నాం**

ఇదే మీడియా సమావేశంలో బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై కూడా ఎంఈఏ తన వైఖరిని వెల్లడించింది. ఆ దేశంతో సానుకూల, నిర్మాణాత్మక, దీర్ఘకాల సంబంధాలను భారత్ కోరుకుంటోందని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. జోధ్‌పూర్ వేదికగా సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 12 వరకు భారత వాయుసేన నిర్వహించనున్న తరంగ్ శక్తి వైమానిక విన్యాసాల్లో బంగ్లాదేశ్ కూడా పాల్గొనుండటం శుభ పరిణామమని అన్నారు. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాల గురించి ప్రస్తావించారు. మరోవైపు జపాన్‌తో పార్లమెంటరీ స్థాయిలో పరస్పర చర్చలు కొనసాగుతున్నాయని ఎంఈఏ వెల్లడించింది. నేపాల్‌లో ఇటీవల ఘోర విపత్తులో పలువురు భారతీయులు కూడా గల్లంతయ్యారు. ఈ క్రమంలో గల్లంతైన భారతీయుల గుర్తింపు కోసం కేంద్రం ప్రయత్నాలు కొనసాగిస్తోందని వీజూూ స్పష్టం చేసింది. నేపాల్‌లో గల్లంతైన 275 మంది భారతీయులతో పాటు, భారత సంతతికి చెందిన వారి కోసం శోధిస్తున్నట్లు తెలిపారు. భారత ఫోరెన్సిక్ టీమ్ కాఠ్‌మాండూలోని ల్యాబ్‌లలో 3 వేల శాంపిల్స్ ఆధారంగా, 1200 డీఎన్ఏ ప్రొఫైల్స్‌ను రూపొందించిందని, దీనికి సంబంధించి పరిశోధన కొనసాగుతోందని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్ సహా మరికొన్ని దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు అమెరికా చట్టం తీసుకొస్తోంది. చట్టసభల ఆమోదం పొందిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కూడా చేశారు. ఈ ప్రతిపాదిత చట్టంపైనా కేంద్రం తాజాగా స్పందించింది. ఈ చట్టానికి సంబంధించి భారత్ తన అభిప్రాయాన్ని ఇప్పటికే అమెరికా ప్రభుత్వానికి తెలియజేసిందని ఎంఈఏ తెలిపింది. ఈ చట్టం అమెరికా- భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయంగా చమురు మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత్ స్పష్టం చేసిందని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

## రామమందిరంలో 105 సార్లు విరాళాల చోరీ

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక విషయాలను గుర్తించింది. ఆలయంలోని నగదు లెక్కింపు గది నుంచి డబ్బును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టినట్లు 105 ఘటనలు గుర్తించినట్లు సిట్? తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. నగదు వ్యవహారంలో అక్రమాలపై దర్యాప్తు కొనసాగుతుండగా, విలువైన వెండి వస్తువులు, ఇతర విరాళాల విషయంలో మాత్రం తనిఖీల్లో ఎలాంటి తేడాలు గుర్తించలేదని నివేదిక వెల్లడించింది. ఆలయంలోని యాత్రికుల సౌకర్య కేంద్రం (పీఎఫ్?సీ)లో ఉన్న నగదు లెక్కింపు గది, ఇతర డిజిటల్ ఆధారాలను సిట్? పరిశీలించింది. సీసీటీవీ ఫుటేజీ, ఇతర డేటా విశ్లేషణలో నగదు లెక్కింపు గది నుంచి అనధికారికంగా డబ్బు తీసుకెళ్లడం లేదా దాచిపెట్టడం జరిగినట్లు భావిస్తున్న 105 సందర్భాలు బయటపడినట్లు నివేదిక పేర్కొంది. ఈ ఘటనల్లో నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న మరికొందరి సహకారం ఉన్నట్లు కూడా వెల్లడైనట్లు సిట్ తెలిపింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను గుర్తించినట్లు స్పష్టం చేసింది. నిందితుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన వివరాలు, వాటిలో వివరణ లేని మొత్తాలు, అనుమానితంగా అక్రమంగా సంపాదించిన డబ్బును పెట్టుబడిగా పెట్టినట్లు భావిస్తున్న స్థిర, చరాస్తుల వివరాలను కూడా సిట్ సేకరించింది.

**ఒక్కొక్క నిందితుడి పాత్రపై దర్యాప్తు**

నగదు అక్రమంగా మళ్లించినట్లు అనుమానిస్తున్న ప్రతి వ్యక్తికి సంబంధించిన అంశాలను సిట్ విడిగా పరిశీలించింది. వారి ద్వారా ఎంత మొత్తం దుర్వినియోగానికి గురై ఉండొచ్చన్న అంచనాలను కూడా నివేదికలో పొందుపరిచినట్లు సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నగదు లెక్కింపు, నిర్వహణ జరుగుతున్న సమయంలోనే లెక్కింపు గదిలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని తెలిపింది. అక్రమ నగదు తరలింపు ఘటనల గుర్తింపుతో పాటు, సంబంధిత వ్యక్తులను గుర్తించడం, వారిని విచారించడం, అనుమానిత అక్రమ సొమ్ము ఎక్కడికి వెళ్లిందో గుర్తించడం వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని సిట్? వెల్లడించింది.

**ఆర్థిక లావాదేవీలు, ఆస్తులపైనా నిఘా**

దర్యాప్తులో భాగంగా నిందితుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. బ్యాంకు రికార్డులు, విరాళాలకు సంబంధించిన వివరాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, ఆర్థిక పత్రాలను పరస్పరం సరిపోల్చి చూస్తున్నట్లు సిట్ తెలిపింది. ఇప్పటివరకు 173 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు నివేదికలో వెల్లడించింది. వీరిలో రామమందిర ట్రస్ట్‌కు చెందిన అధికారులు, అకౌంటింగ్ సిబ్బంది, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, చార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు.

**803 విలువైన వస్తువుల్లో వ్యత్యాసాలు లేవు**

మరోవైపు, రామమందిరానికి అందిన విలువైన వస్తువుల విషయంలో సిట్ తనిఖీలు నిర్వహించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరిచిన 803 విలువైన వస్తువులను భౌతికంగా పరిశీలించినట్లు నివేదిక తెలిపింది. ఈ వస్తువులకు సంబంధించి టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించిన రసీదులను కూడా పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులు ట్రస్ట్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. లాకర్‌లోని వస్తువులను ప్రత్యక్షంగా తనిఖీ చేసిన అనంతరం, వాటిలో ఎలాంటి వ్యత్యాసాలు కనిపించలేదని సిట్ స్పష్టం చేసింది. రసీదులు జారీ చేయని మరో 86 విలువైన వస్తువులను కూడా విడిగా గుర్తించి భౌతికంగా తనిఖీ చేసినట్లు నివేదిక పేర్కొంది.

**944 కిలోల వెండిపైనా పరిశీలన**

రామమందిర ట్రస్ట్ వద్ద ఉన్న వెండి నిల్వలకు సంబంధించిన రికార్డులను కూడా సిట్ పరిశీలించింది. సుమారు 944.411 కిలోల వెండిని కరిగించేందుకు ట్రస్ట్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు పంపినట్లు నివేదికలో పేర్కొన్నారు. అదే సమయంలో సుమారు 200 కిలోల వెండి ఇటుకలు, మరో 38.288 కిలోల వెండి ఇటుకలు, వెండి హారం, చరణ్ పాదుక, రామచరితమానస్‌కు సంబంధించిన విరాళం వంటి అంశాలను కూడా సిట్ పరిశీలించింది. వీటి నిర్వహణలో ఎలాంటి వ్యత్యాసాలను గుర్తించలేదని దర్యాప్తు బృందం తెలిపింది. ఉత్తరప్రదేశ్ పోలీస్ ఐజీ కిరణ్ ఎస్ నేతృత్వంలో సిట్ ఈ దర్యాప్తును కొనసాగిస్తోంది.

# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ గార్డుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం.. అలాంటి వాటిపై నిషేధం



ఏ కొత్త మొబైల్ ఫోన్ కొన్నా స్క్రీన్ గార్డ్ లేదా స్క్రీన్ ప్రొటెక్షన్ వేయించుకోవడం కామన్. ఈ స్క్రీన్ గార్డ్స్ రోడ్డు పక్కన ఎక్కడంటే అక్కడ, తక్కువ ధరలో దొరుకుతాయి. వాటిలో చాలా వరకు క్వాలిటీ తక్కువ. దీంతో అనేకసార్లు వినియోగదారులు మోసపోతుంటారు. అయితే, ఇకపై లో క్వాలిటీ, చీప్ స్క్రీన్ ప్రొటెక్టర్లు, స్క్రీన్ గార్డ్స్ మార్కెట్లో ఉండవు. ఎందుకంటే, ఇలాంటి తక్కువ నాణ్యత కలిగిన స్క్రీన్ ప్రొటెక్టర్లు, స్క్రీన్ గార్డులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిర్ణయం వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమలు కానుంది. తగిన ప్రమాణాలు పాటించని వాటిపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు స్క్రీన్ ప్రొటెక్టర్లను కూడా కేంద్రం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కిందకు తీసుకొచ్చింది. అంటే.. దీని పరిధిలో ఉన్న ఉత్పత్తులు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కనీస నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలి. దీనిపై తాజాగా కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 21, సోమవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం ఇకపై స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ ప్రొటెక్టర్లు తయారు చేసే సంస్థలు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్స్ గూడ్స్ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. బీఐఎస్ రూపొందించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఏప్రిల్ 1 నుంచి విక్రయించబోయే స్క్రీన్ గార్డులు ఈ నాణ్యతను కలిగి ఉండాలి. ఇప్పటికిప్పుడు వీటిపై నిషేధం ఉండదు. కంపెనీలు తమ తయారీని మార్చుకునేందుకు, కొత్తవి, నాణ్యమైనవి తయారు చేసేందుకు, ఉన్న వాటిని విక్రయించేందుకు ఇంకా ఆరు నెలల గడువు ఉంది. కేంద్రం రూపొందించిన రూల్స్ ప్రకారం.. ప్రతి గ్లాస్ తగిన నాణ్యత కలిగి ఉండాలి. అలాగే, స్క్రీన్ విజిబుల్‌గా ఉండాలి. ప్యాకేజింగ్‌కు సంబంధించిన వివరాలు ఉండాలి. బ్లూ లైట్ ఫిల్టరింగ్, యాంటీ గ్లేర్, ప్రైవసీ వంటి ఫీచర్లు కలిగి ఉండాలి. ఈ నిర్ణయం అమలైతే వినియోగదారులకు క్వాలిటీ కలిగిన మొబైల్ స్క్రీన్ గార్డులు మాత్రమే మార్కెట్‌లో లభిస్తాయి.

## భారత్ కేంద్రంగా సీఎంఎఫ్.. నథింగ్ కీలక నిర్ణయం!



స్మార్ట్ డివైజ్‌ల కంపెనీ నథింగ్ తమ అనుబంధ సంస్థ సీఎంఎఫ్‌ని విడదీసి పూర్తి స్థాయి స్టాండెలోన్ భారతీయ కంపెనీగా రిజిస్టర్ చేయనున్నట్లు వెల్లడించింది. ఇందులో మెజారిటీ షేర్‌హోల్డర్లు భారతీయులే ఉంటారని సంస్థ సీఈవో కార్ల్ పే వెల్లడించారు. నథింగ్‌లో భాగమైన సీఎంఎఫ్ అందుబాటు ధరలో, మీడియం రేంజ్ స్మార్ట్ ఫోన్లను తయారు చేస్తోంది. త్వరలో భారత్ ప్రధాన కేంద్రంగా ఈ కంపెనీ తన సొంత టీమ్, పరిశోధన–అభివృద్ధి కార్యకలాపాలు సాగిస్తుందని కార్ల్ తెలిపారు. ఇందులో నథింగ్ సంస్థ షేర్‌హోల్డరుగా, భాగస్వామిగా కొనసాగుతుందని వివరించారు. వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌ని స్థాపించిన కార్ల్ .. ఆ తర్వాత దాన్నుంచి వైదొలిగి 2020లో నథింగ్ పేరిట స్మార్ట్ డివైజ్‌ల బ్రాండ్‌ను ఏర్పాటు చేశారు. లండన్ కేంద్రంగా పనిచేసే ఈ కంపెనీ ఏడాది క్రితం భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఆప్టీమస్ ఇన్‌ఫ్రాకామ్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఇరు సంస్థలు 100 మిలియన్ డాలర్లపైగా (అప్పటి రూపాయి మారకం విలువ ప్రకారం సుమారు రూ. 887 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించాయి. 2028 నాటికి ఇది 1,800 ఉద్యోగాలు కల్పిస్తుందనే అంచనాలు ఉన్నాయి.

# చర్చలు విఫలం.. సమ్మెకు వెళ్లనున్న బ్యాంకు సంఘాలు



దిల్లీ: వారానికి ఐదు రోజుల పని విధానంతో పాటు పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ బ్యాంకు యూనియన్లు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నాయి. ఆర్థిక శాఖ సూచన మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ఐదు రోజుల పని అంశం కూడా ప్రస్తుతం పరిశీలనలో ఉందని చర్చల సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది. అయితే, వారానికి 5 రోజుల పని విధానాన్ని ప్రవేశపెట్టాలన్న తమ డిమాండ్ దిశగా సానుకూల పరిణామాలు కనిపిస్తే అప్పుడు సమ్మె వాయిదా గురించి పరిశీలిస్తామని యూఎఫ్‌బీయూ ప్రకటించింది. మరోవైపు సమ్మెకు ముందు శని, ఆదివారాలు బ్యాంకులు తెరుచుకోవు. 28 నుంచి 30 వరకు సమ్మె కారణంగా మూతపడనున్నాయి. దీంతో మొత్తం ఐదు రోజులు పాటు బ్యాంకు సేవలకు ఆటంకం కలగనుంది. ఈ నెల సెప్టెంబర్ 11న కూడా బ్యాంకు యూనియన్లు సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే.

## నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ నష్టాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిఫ్టీ లాభాల జోరుకు బ్రేక్ పడింది. ప్రధానంగా ఐటీ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు నష్టా ల్లోకి జారాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 329.91 పాయింట్లు (0.44 శాతం) నష్టపోయి 74,529.08 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 85.30 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 23,329.00 వద్ద ముగిసింది. నాలుగు రోజుల వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు హెవీవెయిట్ షేర్లలో లాభాలను స్వీకరించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. దీనితోపాటు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఫార్మా సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. మరోవైపు మీడియా, రియల్ ఎస్టేట్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ రంగాల సూచీలు లాభాల్లో ముగియడంతో మార్కెట్ నష్టాలు కొంతమేర పరిమితమయ్యాయి. నిఫ్టీలో ట్రెంట్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్‌లో కూడా బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం స్వల్పంగా నష్టపోయాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు కొన్ని రంగాల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుని ఇతర రంగాల్లోకి మళ్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## టాటా సియెరా డార్క్ ఎడిషన్ లాంచ్




టాటా సియెరా ఎస్‌యూవీకి స్టైలిష్ లుక్ జోడిస్తూ టాటా.కార్స్ 'డార్క్ ఎడిషన్'ను విడుదల చేసింది. పూర్తిగా బ్లాక్ థీమ్‌తో రూపొందించిన ఈ కొత్త వెర్షన్ ప్రారంభ ధర రూ.13.99 లక్షలుగా ఉంది. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. డెలివరీలు వచ్చే నెలలో మొదలయ్యే అవకాశం ఉంది. సియెరా డార్క్ ఎడిషన్ ప్యూర్ ఎల్, ప్యూర్ ఎల్ (ఓ), ప్యూర్ ప్లస్ ఎల్, అడ్వెంచర్ ప్లస్ ఎల్, అకంప్లిష్డ్, అకంప్లిష్డ్ ప్లస్ వేరియంట్లలో ఇది అందుబాటులో ఉంటుంది. బయట బ్లాక్ థీమ్‌ను కొనసాగించగా.. ఇంటీరియర్‌లో బ్లాక్--వైలెట్ థీమ్‌ను ఇచ్చారు. పర్పుల్ క్రోమ్ యాక్సెంట్లు సియెరా డార్క్ ప్రత్యేకతను మరింత పెంచుతాయి.

# జపాన్ పోరాటం సరిపోలె.. చరిత్రాత్మక టీ20లో భారత్ జయభేరి.!




ఆసియా క్రీడల నడుమ దౌత్య బంధానికి ప్రతీకగా జరిగిన చరిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో టీమిండియా విజయంతో మురిసింది. భారత్, జపాన్ 75 ఏళ్ల ఆత్మీయతకు సాక్షిగా నిలిచిన ఈ ఏకైక మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఏదో అలా గెలుపొందింది. ఇరవై ఓవర్ల ఆట అనుకున్నప్పటికీ.. వర్షం కారణంగా ఐదు ఓవర్లే సాధ్యపడగా రెండు పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించింది మెన్ ఇన్ బ్లూ. పద్దెనిమిదో ఆసియా క్రీడలు కొనసాగుతున్న వేళ.. భారత్, జపాన్ ఏకైక టీ20 ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇరుదేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు ప్రతీకగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు రెండు పరుగుల తేడాతో విక్టరీ కొట్టింది. కంటోలోని సనోలో ఉన్న సనో ఇంటర్నేషనల్ క్రికెట్ మైదానంలో మంగళవారం పూర్తి ఓవర్ల ఆటకు వర్షం అడ్డుపడింది. తడి ఔట్‌ఫీల్డ్ కారణంగా అంపైర్లు, రిఫరీ 5 ఓవర్లు ఆడించారంతే. ఇంకే ముంది జపాన్ బౌలర్లను మనోళ్లు బెంబేలెత్తిస్తారనుకుంటే.. అఫ్గనిస్థాన్‌పై ఆఖరి టీ20లో మెరుపు సెంచరీ బాదిన ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటయ్యాడు.

**అయ్యర్ ఒక్కడే..**

మరో ఓపెనర్ సంజూ శాంసన్(9)ను ఇబ్రహీం తకహాశీ వెనక్కి పంపాడు. అనంతరం.. ఇషాన్ కిషన్(3) సైతం తేలిపోయినా.. అయ్యర్(16) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా ప్రత్యర్థికి 32 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. ఆపై వాషింగ్టన్ సుందర్(2–13) విజృంభణతో జపాన్ బ్యాటర్లు క్రీజులో నిలవలేదు. ఓపెనర్ పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఫలితంగా ఆతిథ్య జట్టు ఐదు ఓవర్లలో4 వికెట్ల నష్టానికి 32 పరుగులకే పరిమితమైంది. అయితే.. ఈ మ్యాచ్‌లో జపాన్‌లో క్రికెట్ విస్తరణకు కీలక అడుగు పడినట్టైంది. ఇరుదేశాల ద్వైపాక్షిక బంధానికి గుర్తుగా నిర్వహించిన ఈ మ్యాచ్‌పై జపనీయులు ఆసక్తి కనబరిచారు. దాంతో.. రాబోయే రోజుల్లో జపాన్ క్రికెట్‌కు మహర్ధశ వచ్చే అవకాశముందంటున్నారు విశ్లేషకులు.

## ఏషియన్ గేమ్‌లో ఇండియాకు తొలి స్వర్ణం.. టీ20 ఫైనల్ మ్యాచ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహిళల క్రికెట్ జట్టు

ఆసియా క్రీడలు 2026 మహిళల క్రికెట్‌ఫైనల్లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. నిషిన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక ఫైనల్ పోరులో పోరులో టీమిండియా విజయం సాధించింది. శ్రీలంక జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 147 పరుగుల భారీ తేడాతో గెలిచిన హర్మన్ ప్రీత్ సేన 2022 తర్వాత మరోసారి గోల్డ్ మెడల్ గెలుచుకుంది. 217 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక జట్టు కేవలం 15.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 69 పరుగులకే ఆలౌట్ అయింది. అంతకుముందు భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఇందులో స్మృతి మంధాన (79), రిచా ఘోష్ అజేయంగా (49), షఫాలీ వర్మ (48) పరుగులు చేశారు. మంధాన, షఫాలీ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మంధాన 45 బంతుల్లో ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌తో ఆమె మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగులు కూడా పూర్తి చేసుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 19 పరుగులు చేసింది. శ్రీలంక తరఫున సుగంధికా కుమారి, కవిషా దిల్హారి, చాముది ప్రభోద ఒక్కో వికెట్ తీశారు.



# స్పోర్ట్స్

## డెబ్యూ మ్యాచ్‌లో అదరగొట్టిన లంక బౌలర్.. ఇంగ్లండ్ ఆలౌట్



చెస్టర్–లీ–స్ట్రీట్ వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి వన్డేలో ఇంగ్లండ్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లు ఆడకుండానే 48.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (67) అర్ధసెంచరీతో రాణించగా, విల్ జాక్స్ (46 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడగా, జో రూట్ (44) రాణించాడు. లంక బౌలర్లలో డెబ్యూ ఆటగాడు సచిందు కొలంబగె, అసితా ఫెర్నాండో చెరో 3 వికెట్లు పడగొట్టగా, దునిత్ వెల్లలాగె, చమీర, మదుషంక తలా ఒక వికెట్ తీశారు. కాగా అరంగేట్రం మ్యాచ్‌లోనే సచిందు తన బౌలింగ్‌తో అదరగొట్టాడు. జో రూట్, బట్లర్ (31), జేమీ ఓవర్టన్ (8) వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ముఖ్యంగా జో రూట్‌ను అర్ధసెంచరీ చేయకుండా అడ్డుపడిన సచిందు ఒక అరుదైన ఫీట్ సాధించాడు. 2018లో లంక బౌలర్ చేతిలో ఫిఫ్టీ చేయకుండా వెనుదిరిగిన రూట్.. మళ్లీ 8 ఏళ్ల తర్వాత హాఫ్ సెంచరీ చేయకుండా ఔటయ్యాడు. ఈ గ్యాప్‌లో లంకతో ఆడిన ప్రతీ మ్యాచ్‌లో రూట్ కనీసం అర్థశతకం సాధించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

## ఓటుపై ఈసీ నీడ!

పౌరులకు రాజ్యాంగం కల్పించిన అత్యంత ప్రాథమిక హక్కు (ఓటు హక్కు)ను నిరాకరించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) 'వ్యత్యాసాలు' (డిస్క్రెపెన్సీలు) అనే కొత్త సాధనాన్ని కనిపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లో దీన్నే 'లాజికల్ డిస్క్రెపెన్సీలు' అని పిలిచారు. ఢిల్లీలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకూ 33.13 లక్షల మంది ఓటర్లకు వారి వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ నోటీసులు జారీ అయ్యాయి. ఇందులో మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీ (98), విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా వంటి రాజ్యాంగ పదవులు నిర్వహించిన, నిర్వహిస్తున్న ప్రముఖులు కూడా ఉన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే కోట్లాది మంది సాధారణ పౌరులు ఎదుర్కొంటున్న ఇదే సమస్యలో, ఇప్పుడు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవులు నిర్వహించిన వ్యక్తులు కూడా చేరడం, ఈసీ ఎంత నిర్లక్ష్యంగా, యాంత్రికంగా ఈ ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃసమీక్షను నిర్వహిస్తోందో స్పష్టం చేస్తుంది. ఇది ప్రజాస్వామ్య మూలాలను, రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీసే చర్యగా కనిపిస్తుంది. వీటిలో అద్వానీ, ఆయన కుమార్తె ప్రతిభ, కోడలు గీతికల పేర్లు 2002 నాటి ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాతో సరిపోలలేదన్న కారణంతో నోటీసులు అందగా, ఆయన కుమారుడు జయంత్ మాత్రం ఈ మ్యాపింగ్ ప్రక్రియను దాటగలిగారు. సిసోడియా భార్య సీమ నోటీసుకు కారణం ఆమె పేరులో పొంతన కుదరకపోవడం కాగా, వారి కుమారుడు మీర్ నోటీసుకు తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసమే కారణంగా చూపారు. అయితే, నోటీసు అందినంత మాత్రాన పేరు ఆటోమేటిక్‌గా తొలగిపోదని, తుది జాబితా విడుదలకు ముందు వివరణ ఇచ్చే అవకాశం ఓటర్లకు ఉంటుందని ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు గతంలోనే ఒక కీలక వ్యాఖ్య చేసింది, ఈసీ ప్రస్తావిస్తున్న కొన్ని 'వ్యత్యాసాలు', అంటే ఇంటిపేర్లలో స్పెల్లింగ్ స్వల్ప తేడాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయసు వ్యత్యాసాలు వంటివి, భారత పరిస్థితుల్లో చాలా సాధారణమైనవి, సహజమైనవని పేర్కొంది. అయినప్పటికీ, ఎన్నికల జాబితాను 'డైట్' చేయాలన్న పట్టుదలతో ఉన్నట్టున్న ఈసీ, సబబైన కారణాలతోపాటు హాస్యాస్పదమైన కారణాలతో కూడా పేర్లను తొలగిస్తోంది. గైర్హాజరు, స్థల మార్పిడి, మరణం, నకిలీ (ఏఎస్‌డీడీ) కేటగిరీలకు చెందిన పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ఈసీ బాధ్యతే. కానీ ఈ ప్రక్రియలో తన అధికార పరిధిని మించి, జాబితాను కత్తిరించడంలో ఈసీ చాలా ముందుకు వెళ్లింది.

ఎస్ఐఆర్ మొదటి ఏడాదిలోనే దేశవ్యాప్తంగా దాదాపు ఆరు కోట్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఢిల్లీలో ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరిని, భారతీయుడు కాని వ్యక్తిలా చూసేలా చేశారు. వ్యత్యాసాలున్న ఓటర్లకు తమ డేటాను సరిదిద్దుకునేందుకు సిస్టమ్-జనరేటెడ్ నోటీసులు జారీ చేస్తున్నామని, ఓటరుకు వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా, సహేతుకమైన, అప్పీలు చేసుకోగల ఉత్తర్వు లేకుండా ఏ పేరునూ తొలగించమని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ, ఆచరణలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. "అర్హత ఉన్న ఏ పౌరుడూ వదిలిపెట్టబడకుండా, అర్హత లేని ఏ వ్యక్తీ చేరకుండా చూసేలా, పారదర్శక, భాగస్వామ్య, సమగ్రమైన పునఃసమీక్ష ప్రక్రియకు తమ నిబద్ధతను ఈసీ పునరుద్ఘాటిస్తోంది" అని కమిషన్ చెబుతోంది. ఈ సూత్రం, ఈ వైఖరి వినడానికి సహేతుకంగానే అనిపిస్తాయి, కానీ ఆచరణలో అనుసరిస్తున్న చర్యలు మాత్రం ఆ మాటలకు అనుగుణంగా లేవు.

చట్టం నిర్దేశించిన నియమావళి ప్రకారమే ఒక వ్యక్తి ఓటర్ల జాబితాలో స్థానం సంపాదిస్తారు. దరఖాస్తుదారు నిర్దేశిత షరతులను నెరవేర్చకపోతే, ఆ దరఖాస్తును తిరస్కరించే అధికారం ఈసీకి ఉంటుంది. అంటే, ప్రతి ఎంట్రీ కూడా ఈసీ, దరఖాస్తుదారు ఇద్దరూ భాగస్వాములుగా ఉన్న ఒక ప్రక్రియ ద్వారానే పరిశీలనకు గురవుతుంది. కాబట్టి, ఒక వ్యక్తి పేరు జాబితాలో ఎందుకు ఉండకూడదో వివరించాల్సిన బాధ్యత ఈసీపైనే ఉండాలి తప్ప, తన పేరు జాబితాలో ఎందుకు ఉండాలో వివరించాల్సిన బాధ్యత ఓటరుపై ఉండకూడదు. ఇది వ్యతిరేక దృక్పథం, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది. కానీ దురదృష్టవశాత్తు ఈసీ ఇదే వైఖరిని

### సంపాదకీయం

అవలంబించింది. ఒక ముఖ్యమంత్రికి ఓటు హక్కు లభిస్తుందా లేదా అనేది ముఖ్యమైన విషయమే, అలాగే ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటున్న చాలా సాధారణ పౌరుల విషయం కూడా అంతే ముఖ్యమైనది. ఎందుకంటే వారికి ఈ ప్రక్రియలో ఉన్న ఏకైక వాటా, తాము ఈ దేశ పౌరులమన్న వాస్తవమే. ఈ దేశం వారిది, వారు ఈ దేశానికి చెందినవారు. ఈ సహజమైన, సేంద్రియ బంధంతో ఈసీ ఆటలాడటానికి వీలు కల్పించకూడదు. కేవలం సాంకేతిక కారణాలతో, యాంత్రికమైన ప్రక్రియతో కోట్లాది భారతీయుల ఓటు హక్కును ప్రశ్నార్థకం చేయడం మానుకుని, పారదర్శకత, జవాబుదారీతనంతో ముందుకు సాగాల్సిన బాధ్యత ఇప్పుడు ఈసీపైనే ఉంది.

ఇక్కడ మరో కీలక అంశాన్ని కూడా గమనించాలి. ఢిల్లీలో మాత్రమే కాకుండా, బిహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ ఇదే తరహా సమస్యలు ఎదురయ్యాయి. ప్రతి రాష్ట్రంలోనూ లక్షలాది పేర్లు వేర్వేరు సాంకేతిక కారణాలతో జాబితా నుంచి మాయమవడం, ఒక నమూనాగా (ప్యాటర్న్) కనిపిస్తోంది. ఇది కేవలం ఒక్క రాష్ట్రంలో జరిగిన అనుకోని పొరపాటు అని కొట్టిపారేయలేం. దేశవ్యాప్తంగా ఒకే విధమైన ప్రమాణాలు, ఒకే విధమైన పారదర్శకత పాటించకుండా, ఎంపిక చేసిన రాష్ట్రాల్లో మాత్రమే ఈ తీవ్రస్థాయి పునఃసమీక్షలు చేపట్టడం, ప్రతిపక్షాల నుంచి తీవ్ర అనుమానాలకు, ఆరోపణలకు దారితీస్తోంది. ఎన్నికల సంఘం అనేది రాజ్యాంగబద్ధమైన, స్వతంత్రమైన సంస్థ అని చెప్పుకుంటున్నప్పుడు, దాని చర్యలు కూడా ఆ స్వతంత్రతను, నిష్పాక్షికతను ప్రతిబింబించాలి. కేవలం జాబితాలను 'శుద్ధి' చేయడమే లక్ష్యంగా పెట్టుకుని, అసలైన ఓటర్లు కూడా ఈ ప్రక్రియలో బాధితులుగా మారే పరిస్థితి తలెత్తితే, అది ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకే విఘాతం కలిగిస్తుంది. కాబట్టి, నోటీసుల సంఖ్యను తగ్గించుకోవడం కంటే, ప్రతి నోటీసుకూ స్పష్టమైన, రాతపూర్వక కారణం ఇవ్వడం, ఓటరుకు తగినంత సమయం, సులభమైన అప్పీలు వ్యవస్థ కల్పించడం ఇప్పుడు ఈసీకి ముందున్న అసలైన సవాలు!

---

### పనికొచ్చే పలుకు



## టైం.. టుగెదర్!?

జీవితంలో మనం సంపాదించేది డబ్బు మాత్రమే కాదు.. మనుషుల్ని కూడా. కానీ డబ్బు కోసం పరుగెత్తే క్రమంలో మనుషుల కోసం సమయాన్ని ఖర్చు చేయడం మర్చిపోతున్నాం.


ఉదయం లేవగానే ఫోన్.. పనిలో బిజీ.. మధ్యలో సోషల్ మీడియా.. రాత్రి మళ్లీ స్క్రీన్.. ఇలా రోజు పూర్తవుతోంది. మన టైమ్‌లైన్‌లో వందల మంది కనిపిస్తున్నారు. కానీ మన పక్కనే ఉన్నవారితో మాట్లాడటానికి మాత్రం సమయం ఉండటం లేదు. ఇదే నేటి లైఫ్‌స్టైల్‌లో పెద్ద ఐరనీ. ఒక్కసారి ఆలోచించండి. కుటుంబంతో గడిపే సమయం నిజంగా ఎంత? పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వాళ్లకు కావాల్సింది ఖరీదైన బొమ్మలు కాదు.. మీతో గడిపే సమయం. వాళ్లు చెప్పే చిన్నచిన్న విషయాలను వినడం, వాళ్లతో కలిసి నవ్వడం, వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పడం.. ఇవే వారి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. మీరు ఎంత సంపాదించారన్నది ఒకరోజు మరిచిపోవచ్చు. కానీ "నాన్న నాతో ఆడేవాడు.. అమ్మ నాతో మాట్లాడేది" అన్న జ్ఞాపకం మాత్రం జీవితాంతం ఉంటుంది. అలాగే స్నేహితుల విషయంలోనూ సంఖ్య ముఖ్యం కాదు.. నాణ్యత ముఖ్యం. సోషల్ మీడియాలో వందల మంది ఫ్రెండ్స్ ఉండొచ్చు. కానీ మన కష్ట సమయంలో ఒక్క ఫోన్‌కాల్ దూరంలో నిలబడే వ్యక్తి ఎవరు? ఆ ఒక్క నిజమైన మిత్రుడే అసలైన సంపద. అందుకే అందరికీ సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. "జీవితంలో విలువను పెంచే మనుషులకు విలువైన సమయాన్ని ఇవ్వండి".

భాగస్వామితో గడిపే సమయం మరింత కీలకం. ఒకే ఇంట్లో ఉంటూ కూడా రెండు వేర్వేరు ప్రపంచాల్లో జీవించడం నేటి సంబంధాల్లో కనిపిస్తున్న సమస్య. ఎదురెదురుగా కూర్చున్నా.. ఇద్దరి చేతుల్లోనూ ఫోన్లే ఉంటే ఆ బంధం ఎలా బలపడుతుంది? ప్రతిరోజూ కొద్దిసేపైనా ఫోన్లు పక్కన పెట్టి మాట్లాడుకోవడం, ఒకరి రోజును మరొకరు తెలుసుకోవడం, కలిసి నవ్వుకోవడం.. ఇవి చిన్న విషయాల్లా కనిపించినా సంబంధాన్ని బలంగా ఉంచే పెద్ద పెట్టుబడులు. అయితే వీటన్నింటికంటే ముందు "మీతో మీరు గడిపే సమయం" అవసరం. ఒంటరిగా ఉండటం అంటే loneliness కాదు. అది self-connection. రోజులో కొంతసేపు ఫోన్ లేకుండా, సోషల్ మీడియా లేకుండా, ఇతరుల అభిప్రాయాలు లేకుండా మీతో మీరు మాట్లాడుకోండి. ఏం కావాలి? ఎటు వెళుతున్నారు? నిజంగా సంతోషంగా ఉన్నారా? మీ జీవితం మీకు నచ్చుతున్నదా? అనే ప్రశ్నలు వేసుకోండి. జెన్ జెడ్‌కి ఇది మరింత ముఖ్యమైన లైఫ్‌స్టైల్ షిఫ్ట్. ఎందుకంటే "వాళ్లకు ప్రపంచం చేతిలో ఉంది.. కానీ సమయం మాత్రం చేతిలోంచి జారిపోతోంది". డిజిటల్ కనెక్షన్లు పెరుగుతున్న కొద్దీ నిజమైన కనెక్షన్లు తగ్గిపోకుండా చూసుకోవాలి. జీవితం అంటే కేవలం సంపాదించడం కాదు. ఎవరితో కలిసి నవ్వామో, ఎవరిని ప్రేమించామో, ఎవరి కోసం సమయం కేటాయించామో కూడా. "ఎందుకంటే చివరికి మనం గుర్తుచేసుకునేది.. ఎంత సమయం జీవించామన్నది కాదు. ఎవరితో కలిసి ఆ సమయాన్ని జీవించామన్నదే!"

---

# అంతరిక్షంలో ఆయుధ 'కక్ష్య'!

**అంతరిక్షం ఇక శాంతి ప్రాంతం కాదు, కొత్త యుద్ధభూమిగా మారుతోంది! కక్ష్యలో ఆయుధాలు ఉన్నాయని అమెరికాయే అంగీకరించిన వేళ, ఏది రక్షణో ఏది దాడో తేల్చుకోలేని అస్పష్టత మిగిలింది. నియమాలు స్పష్టంగా లేకపోతే, ఒక్క పొరపాటు తీర్పే భూమిపై పెను సంక్షోభానికి దారితీయవచ్చు. తారల మధ్య అనుమానాలు పెరిగేకంటే, పారదర్శకతతోనే శాంతి సాధ్యం.**




భూమిపై యుద్ధాలు చాలవన్నట్టు, ఇప్పుడు మనిషి తన కయ్యాలను కక్ష్యలోకీ విస్తరించాడు. 2025 నాటికే దాడి, రక్షణ రెండింటినీ కలిపిన 'అంతరిక్ష నియంత్రణ' అనే భావనను అమెరికా సైనిక సిద్ధాంతం బహిరంగంగా చర్చిస్తూ వచ్చిన నేపథ్యంలో, ఈ ఏడాది సెప్టెంబర్ 14న అమెరికా వైమానిక దళ కార్యదర్శి ట్రాయ్ మీంక్ చేసిన ప్రకటన ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. "శత్రు దేశాల ప్రతికూల చర్యల నుంచి రక్షణ కోసం" తమ దేశం ఇప్పటికే కక్ష్యలో 'ఆన్-ఆర్బిట్ స్పేస్ కంట్రోల్ వెపన్స్'ను మోహరించిందని అధికారికంగా అంగీకరించారు. దీన్ని అమెరికా అంతరిక్ష దళాధిపతి జనరల్ డగ్లస్ షీస్ కూడా ధృవీకరించారు. మేరీల్యాండ్‌లోని జాతీయ హార్బర్‌లో జరిగిన వైమానిక, అంతరిక్ష, సైబర్ సదస్సులో మీంక్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ, "ఎక్కడ ముప్పు ఎదురైనా దాన్ని ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. అయితే ఈ ఆయుధాలు ఎప్పుడు మోహరించారో, ఎన్ని ఉన్నాయో, అవి సరిగ్గా ఏం చేయగలవో మాత్రం ఆయన వెల్లడించలేదు. "ఈ వివరాలు బహిర్గతం చేయడం కార్యాచరణ భద్రతకు హాని కలిగిస్తుంది" అంటూ దాటవేశారు. ఇది కేవలం ఒక సైనిక ప్రకటన కాదు, కమ్యూనికేషన్లు, ఇంధనం, ఆర్థిక నెట్‌వర్క్‌లన్నీ ఇప్పుడు ఉపగ్రహ వ్యవస్థలపైనే ఆధారపడి ఉన్నాయి. అనేక వాణిజ్య ఉపగ్రహ వ్యవస్థలు పౌర, సైనిక అవసరాలు రెండింటినీ ఒకేసారి తీర్చేవిగా మారాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని, అమెరికా, రష్యా, చైనా, భారత్ సహా అనేక దేశాలు ప్రతి అంతరిక్ష సామర్థ్యాలను అభివృద్ధి చేస్తూ, భూకక్ష్యను తదుపరి పెద్ద యుద్ధభూమిగా మార్చే సాంకేతిక, వ్యూహాత్మక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. వాణిజ్య ఉపగ్రహాల సైనిక వినియోగం పెరుగుతున్న కొద్దీ, అంతర్జాతీయ మానవతా చట్టం కింద వాటికి లభించే రక్షణలే ప్రమాదంలో పడుతున్నాయి. ఎందుకంటే ఈ చట్టం ఉపగ్రహాలు ఇంత సంక్లిష్టంగా అనుసంధానమై, ద్వంద్వ వినియోగంతో ఉంటాయని ఊహించలేదు.

ఇక్కడే అసలైన వైరుధ్యం దాగి ఉంది. కక్ష్యాంతర రక్షణ వ్యవస్థల అవసరాన్ని సమర్థించుకునే వివరాలే, సరిగ్గా నిర్వచించని ఆయుధాలను అస్థిరతకు మూలకారణంగా మార్చే అవకాశం ఉంది. మీంక్ ఈ ఆయుధాన్ని 'రక్షణాత్మకమైనది' అని అభివర్ణించినప్పటికీ, అమెరికా సైనిక సిద్ధాంతమే 'అంతరిక్ష నియంత్రణ' అనే పదాన్ని దాడి, రక్షణ రెండు కార్యకలాపాలనూ కలిపే విస్తృత భావనగా నిర్వచిస్తోంది. అంటే, "ఇది కేవలం కాపలా కుక్క మాత్రమే" అని చెబుతూనే, అవసరమైతే అది కాటు వేయగలదని కూడా ఒప్పుకోవడమే! భవిష్యత్తులో కృత్రిమ మేధ నడిపే స్వయంచాలక ఉపగ్రహాలు అందుబాటులోకి వచ్చే కొద్దీ, ఈ గందరగోళం మరింత తీవ్రమయ్యే ప్రమాదం లేకపోలేదు. దిశను మార్చగల రెండు ఉపగ్రహాలు, ఒకదానికొకటి ఉద్దేశాలు తెలియకుండానే సమీపిస్తే ఏం జరుగుతుంది? ఇందుకు తోడు, స్పష్టమైన విధాన వివరాలు లేకపోవడం సమస్యను ఇంకా జటిలం చేస్తోంది - 'శత్రు చర్య' అంటే ఏమిటో, ఈ ఆయుధం ఏం చేయగలదో ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది. బాహ్య అంతరిక్ష ఒప్పందం (అవుటర్ స్పేస్ ట్రీటీ) కక్ష్యలో ఆయుధాలను నేరుగా నిషేధించదు, కానీ దాని ఆర్టికల్ 4 అణ్వాయుధాలను, ఇతర సామూహిక విధ్వంస ఆయుధాలను కక్ష్యలో ఉంచడాన్ని నిషేధిస్తుంది. ఆధునిక సమాజానికి ఉపగ్రహ ఆధారిత నెట్‌వర్క్‌ల కేంద్రీయతను, సంప్రదాయ ఆయుధాలు కూడా సామూహిక నష్టం కలిగించగల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈ నిషేధం ఇప్పుడు ఒక అస్పష్టమైన రేఖగా మిగిలిపోతోంది. ఈ ఒప్పందంలోని ఆర్టికల్ 3 కూడా, అంతరిక్ష కార్యకలాపాలు అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా ఉండాలని నిర్దేశిస్తుంది.

కానీ ఒక వాణిజ్య సంస్థ నిర్వహించే స్వయంచాలక, ద్వంద్వ-వినియోగ కక్ష్యాంతర ఆయుధం, అవాంఛితంగా ఒక రక్షణాత్మక దాడిని ప్రారంభిస్తే? అప్పుడు జవాబుదారీతనాన్ని నిర్ధారించేందుకు, బాధ్యతా ఒప్పందం (లయబిలిటీ కన్వెన్షన్) సహా ఇప్పటికే ఉన్న నియమాలేవీ నేరుగా వర్తించలేని పరిస్థితి తలెత్తుతుంది. సమకాలీన సాంకేతికత, నియమాధార ప్రపంచ క్రమంపై తగ్గుతున్న గౌరవం డిమాండ్ చేస్తున్న దానికి, ప్రస్తుతం ఉన్న నియమాలు చాలా స్థూలంగా, పాతబడిపోయినట్టుగా కనిపిస్తున్నాయి.

అంతరిక్షంలో ఆయుధ పోటీని నిరోధించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన 'ఓపెన్-ఎండెడ్ వర్కింగ్ గ్రూప్', ఈ బహిర్గత సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వాలకు ఒక చక్కటి వేదికను అందిస్తుంది. అయితే, ఏ ఆయుధాలను మోహరించిందో వివరాలు వెల్లడించకుండా అమెరికా దాటవేస్తే, ఈ వేదిక కూడా ఒక చర్చావేదికగా మాత్రమే మిగిలిపోతుంది. అంతరిక్షంలో పారదర్శకత లేకపోవడం, భూమిపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ఎవరో ఒకరు "నా దగ్గర ఏదో ఉంది, అది ఏమిటో మాత్రం చెప్పను" అంటే, మిగతా దేశాలు కూడా అదే బాటలో నడవడం, ఆయుధాలను గుట్టుచప్పుడు కాకుండా పోగేసుకోవడం మొదలవుతుంది. ఇది ఒక ప్రమాదకరమైన అనిశ్చిత చక్రానికి దారితీస్తుంది. చైనా, రష్యాలు కూడా ప్రతి ఉపగ్రహ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తున్నాయని అమెరికా వాదిస్తోంది నిజమే, కానీ "వాళ్లు చేస్తున్నారు కాబట్టి మేమూ చేస్తాం" అన్న తర్కం, చివరికి అందరినీ ఒక నియంత్రణ లేని ఆయుధ పోటీలోకి నెట్టేస్తుంది. అందుకే అమెరికా ప్రభుత్వం తాను మోహరించిన ఆయుధాల వివరాలను వెల్లడించడంతోపాటు, చర్య తీసుకునే ఖచ్చితమైన పరిమితులను, ఉద్రిక్తత పెరిగే స్థాయిలను స్పష్టంగా నిర్వచించే బహుపాక్షిక పాలనా ఏర్పాటులో భాగస్వామిగా మారాలి. లేకపోతే, రేపు ఏదోక ఉపగ్రహం అనుకోకుండా దిశ మార్చుకున్నా, లేదా ఒక కృత్రిమ మేధ వ్యవస్థ తప్పుగా ఒక సంకేతాన్ని 'శత్రు చర్య'గా భావించినా, భూమిపై నిజమైన సంక్షోభం చెలరేగే ప్రమాదం ఉంది. అంతరిక్షం ఇక "శాంతియుత అన్వేషణ" ప్రాంతంగా మిగలదు, అది కూడా భూమిపై మనం సృష్టించుకున్న అపనమ్మకాలు, ఆయుధ పోటీల మరో వేదికగా మారిపోతుంది. అందుకే, ఆలస్యం కాకముందే, స్పష్టమైన నియమాలు, పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన బహుపాక్షిక ఏర్పాటు ద్వారా ఈ 'తలరాత'ను మనం మార్చుకోవాలి! ■

---




ఫోన్‌కు దూరంగా ఎన్ని గంటలు ఉండగలరు? -ఈ ప్రశ్న ఎవరికి వాళ్లు వేసుకునే రోజులివి. రోజులో సగం సమయం ఫోన్ చూస్తూ గడిపే రోజులు ఇక చెల్లిపోయాయి. దానివల్ల మెదడు తీవ్రంగా అలసిపోవడమే కాకుండా, డోపమైన్ స్థాయిలు కూడా దెబ్బతింటున్నాయి. రోజులో కనీసం కొన్ని గంటలైన ఫోన్ పక్కన పెట్టాల్సిన తరుణమిది. ఆ సమయంలో పూర్తి ఏకాగ్రతతో పని చేయాల్సిన సమయం కూడా. అప్పుడే మీరు అత్యున్నత విజయాన్ని, సంపదను సాధించగలరు. కాదూ.. రోజంతా ఆన్‌లైన్‌లోనే ఉంటామంటే.. జీవితం ఆఫ్‌లైన్‌లోకి వెళ్లిపోతుంది జాగ్రత్త!!

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## గోకితే చాలు.. నెలకు రూ.13 లక్షలు!



మసాజ్ సెంటర్లు విన్నాం, స్పాలు తెలుసు. కానీ 'గోకుడు సెలూన్లు' వినుంటారా? చైనాకు చెందిన 32 ఏళ్ల జాంగ్ జియావోచావో అనే వ్యక్తి, భార్య భర్త వీపు గోకుతున్న వీడియో చూసి, దాని కింద కామెంట్లలో "అలా ఎవరైనా గోకితే డబ్బులిస్తాం" అని రాయడం చూసి ఐడియా తట్టింది. చిన్నప్పుడు నాన్న వీపు గోకుతుంటే హాయిగా నిద్రపోయిన జ్ఞాపకంతో, షెన్‌జెన్‌లో సెలూన్ తెరిచాడు. గంటకు 41 డాలర్లు వసూలు చేస్తూ, ప్లాస్టిక్ గోళ్లతో మెల్లగా గోకే ఈ సర్వీస్‌కు ఫుల్ డిమాండ్. రెండు సెలూన్లతోనే నెలకు రూ.13 లక్షలు సంపాదిస్తూ, ఇప్పుడు దేశవ్యాప్తంగా 100 బ్రాంచీలు తెరవాలని ప్లాన్ చేస్తున్నాడు. మసాజ్ కంటే హాయిగా ఉందంటున్నారు కస్టమర్లు!

పెన్ సత్తా
బుధవారం 23 సెప్టెంబర్ 2026

# ఏడాదిగా సోషల్ మీడియాకు దూరంగా ఐశ్వర్య లక్ష్మి

## వాటితో విసిగిపోయానంటూ కామెంట్..!


దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య లక్ష్మి గత ఏడాది కాలంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నారు. సాధారణంగా సినీ తారలు తమ సినిమాల ప్రచారం, వ్యక్తిగత విషయాలు, అభిమానులతో అనుసంధానం కోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. అయితే ఐశ్వర్య లక్ష్మి మాత్రం అందుకు భిన్నంగా సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తాజాగా తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ఆమె వెల్లడించారు.సోషల్ మీడియాను పూర్తిగా వదిలేస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. మొదట కొంతకాలం మాత్రమే సామాజిక మాధ్యమాలకు విరామం తీసుకుని, ఆ తర్వాత మళ్లీ తిరిగి రావాలని భావించానని చెప్పారు. అయితే కాలం గడిచే కొద్దీ సోషల్ మీడియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించిన తర్వాత తిరిగి రావాలనే ఆలోచనను విరమించుకున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత కంటెంట్ విపరీతంగా పెరగడం, దాన్ని ఉపయోగించి కొందరు చేస్తున్న అసభ్యకరమైన ఎడిటింగ్ తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి కంటెంట్ పెరుగుతుండటం తనకు నచ్చలేదని, చివరకు మానసిక ప్రశాంతత కోసం పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఉన్న సమయంలో కామెంట్లు, పర్సనల్ మెసేజెస్ తాను చదివేదాన్నని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అయితే వాటిని పదేపదే చదవడం వల్ల తనపై ప్రతికూల ప్రభావం పడేదని చెప్పారు. కొన్నిసార్లు ప్రపంచమంతా తనకు వ్యతిరేకంగా ఉందనే భావన కలిగేదని వెల్లడించారు. ముఖ్యంగా ప్రతికూల వ్యాఖ్యలు మనకు తెలియకుండానే మన ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక దశలో తనను ఎవరూ ఇష్టపడరనే భావన కూడా కలిగిందని తెలిపారు. అందుకే సోషల్ మీడియా నుంచి దూరంగా ఉండటం తనకు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని చెప్పారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల తన జీవితంలో ఎంతో స్వేచ్ఛ లభించినట్లు అనిపిస్తోందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. ప్రస్తుతం తాను చాలా సంతోషంగా ఉన్నానని, సామాజిక మాధ్యమాల్లో ఉండకపోవడం వల్ల తనకు ఎలాంటి అసంతృప్తి లేదని తెలిపారు. తాను మళ్లీ సోషల్ మీడియాలోకి రావాలని తన నిర్వాహకులు సూచించిన విషయాన్ని కూడా ఆమె వెల్లడించారు. సోషల్ మీడియా ఖాతాను తిరిగి ప్రారంభించకపోతే ఆర్థికంగా చాలా నష్టపోతానని వారు చెప్పినట్లు తెలిపారు. అయితే డబ్బు కంటే తనకు లభిస్తున్న మానసిక ప్రశాంతతే ముఖ్యమని వారికి చెప్పినట్లు ఐశ్వర్య లక్ష్మి వెల్లడించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండటంతో బ్రాండ్ ప్రచారాల విషయంలో కూడా కొన్ని అవకాశాలను వదులుకోవాల్సి వస్తుందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. తాను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయలేనని స్పష్టం చేశారు. అయితే సోషల్ మీడియాలో ప్రచారం చేయకపోయినా ప్రజలు తనను సినిమాల ద్వారానే గుర్తుపెట్టుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



# ఊరిలో ఒక నక్క ఉండేది.. బాలకృష్ణ వాయిస్‌తో ఫహద్ ఫాసిల్ 'డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్' ట్రైలర్



మాలీవుడ్ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాసిల్ హీరోగా నటిస్తున్న తెలుగు డెబ్యూ ఫిల్మ్ ఐశీత్ ుతీశీబఎశ్రీవ్ ష్ట్రవ ుతీశీబఎశ్రీవ. ఫాంటసీ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రాన్నిబాహుబలి ఫేం ఆర్కా మీడియా వర్క్స్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి. శశాంక్ యేలేటి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఊరిలో ఒక నక్క ఉండేది.. దానికి రెండు విషయాలు చాలా బాగా తెలుసు.. ఒకటి డబ్బులు.. రెండోది ట్రబుల్ అంటూ బాలకృష్ణ వాయిస్ ఓవర్‌తో షురూ అయింది ట్రైలర్. ఎక్కడ డబ్బులున్నా అది వాసనతో పసిగట్టేసేది.. ఎక్కడ ట్రబుల్ ఉన్నా అది తప్పించుకుని పారిపోయేది.. ఒక రోజు డబ్బులు, ట్రబుల్ ఒకేసారి ఎదురయ్యాయి. నక్కకు డబ్బులు మాత్రమే కనిపించాయి.. కానీ దాని పక్కనే ట్రబుల్ కనిపించలేదు.. అంటూ సాగుతున్న ట్రైలర్ ఫహద్ ఫాసిల్‌తోపాటు సారా పాలేకర్ మధ్య సన్నివేశాలతో కొంచెం ఫన్, కొంచెం సీరియస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఆర్కా మీడియా వర్క్స్, ఎస్ ఎస్ రాజమౌళి కుమారుడు ఎస్ఎస్ కార్తికేయ ూష్ట్రశీషఱఅస్త్ర దీబంఱఅవం సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్ఎస్ రాజమౌళి సమర్పిస్తున్న ఈ మూవీకి కాలభైరవ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 2న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా ఈ మూవీని విడుదల చేస్తున్నారు.



# మరోసారి విజయ్ దేవరకొండ-రష్మిక జోడీ మ్యాజిక్..

## 'రణబాలి' నుంచి 'ఏందయ్యా స్వామి' పాట విడుదల

టాలీవుడ్‌లో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందిన జోడీల్లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీ ఒకటి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో కలిసి నటించిన ఈ జంట మరోసారి 'రణబాలి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఏందయ్యా స్వామి' అనే పూర్తి పాటను చిత్రబృందం విడుదల చేసింది. 'ఏందయ్యా స్వామి' పాటకు అజయ్--అతుల్ సంగీతం అందించారు. పల్లెటూరి జానపద శైలికి ఆధునిక మెలోడీ స్వరాలను జోడిస్తూ పాటను ప్రత్యేకంగా రూపొందించారు. మొదటిసారి వినగానే శ్రోతలను ఆకట్టుకునేలా సంగీతాన్ని తీర్చిదిద్దారు. పాటలోని సాహిత్యం కూడా గ్రామీణ ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించేలా సాగుతుంది. "ఏందయ్యా స్వామి.. ఇంతగా గాస్తాంది.. ఎన్నెలా ఊపేస్తా ఉంది" అంటూ సాగే పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే పదజాలం, జానపద బాణీ, మెలోడీ కలయిక పాటకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నాయి. ఈ పాటలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో ఈ జోడీకి వచ్చిన ఆదరణ నేపథ్యంలో.. 'రణబాలి'లో వీరిద్దరినీ కలిసి చూడటంపై అభిమానుల్లో మొదటి నుంచే ఆసక్తి ఉంది. తాజాగా విడుదలైన పాటలో వీరిద్దరి మధ్య కనిపించే ప్రేమ, భావోద్వేగాలు, సహజమైన హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాత్రలకు తగ్గట్టుగా విజయ్, రష్మిక కనిపిస్తున్న తీరు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పాటలోని దృశ్యాల్లో పల్లెటూరి వాతావరణాన్ని సహజంగా చూపించే ప్రయత్నం కనిపిస్తోంది. పాత్రల దుస్తులు, పరిసరాలు, విజువల్స్ అన్నీ కథ జరిగే ప్రాంతానికి తగ్గట్టుగా ఉండటంతో పాటకు మరింత సహజత్వం వచ్చింది. 'ఏందయ్యా స్వామి' పాట విడుదలైన వెంటనే ప్రేక్షకుల నుంచి స్పందన మొదలైంది. ముఖ్యంగా పాటలోని జానపద శైలి, సంగీత కూర్పు, సాహిత్యం గురించి అభిమానులు చర్చించుకుంటున్నారు. విజయ్ దేవరకొండ--రష్మిక జోడీని మరోసారి తెరపై చూడబోతుండటంతో వారి అభిమానుల్లోనూ ఈ పాటపై ఆసక్తి కనిపిస్తోంది. గాయకుల ఆలాపన, సాహిత్యానికి అనుగుణంగా రూపొందించిన దృశ్యాలు పాటకు ప్రత్యేకమైన వాతావరణాన్ని తీసుకొచ్చాయి.

# పుష్పలో ఆ రోల్ నేనే చేయాల్సింది: శివాజీ ఆసక్తికర కామెంట్స్



టాలీవుడ్ నటుడు శివాజీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప మూవీ గురించి ఆయన మాట్లాడారు. కోర్టు మూవీ హీరో నటించిన తెల్లకాగితం ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌కు హాజరైన ఆయన పుష్ప సినిమా గురించి కామెంట్స్ చేశారు. ఆ మూవీలో కీలక పాత్రపై ఓ ఇంట్రెస్టింగ్ విషయాన్ని పంచుకున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఎవరికి ఏ పాత్ర రాసిపెట్టి ఉంటే వాళ్లకే దక్కుతుందన్నారు. పుష్ప చిత్రంలో సునీల్ పోషించిన రోల్ మొదట తనకే వచ్చిందని శివాజీ వెల్లడించారు. మంగళ శీను పాత్ర నేను చేయాల్సిందని తెలిపారు. కానీ మనం ఎంత అనుకున్నా.. విధి ఒకటి రాసి పెట్టి ఉంటుందని శివాజీ అన్నారు. అది సునీల్ ఖాతాలోకి వెళ్లాలని రాసిపెట్టి ఉందన్నారు. అందుకే సునీల్ మంగళం శీనుగా మిమ్మల్ని అలరించాడని తెలిపారు. ఆ క్యారెక్టర్‌లో సునీల్ అద్భుతంగా నటించారని కొనియాడారు. అలా మంగళం శ్రీను పాత్ర వెనుక ఉన్న అసలు నిజాన్ని రివీల్ చేశారు. ఈ సందర్భంగా తెల్ల కాగితం సినిమాతో తనకున్న అనుబంధాన్ని శివాజీ గుర్తుచేసుకున్నారు. రాజమండ్రి నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ తన వద్దకు వచ్చిందన్నారు. ఈ కథ వినగానే విపరీతంగా నచ్చడంతో తానే స్వయంగా నిర్మించాలని కూడా భావించినట్లు చెప్పారు. ఒక చిన్న టౌన్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ ఎమోషనల్ లవ్ స్టోరీ ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ మూవీ హీరో హర్ష్ రోషన్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవాలని కోరుకుంటున్నట్లు శివాజీ తెలిపారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com